
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు | నిర్మల్ | మంచిర్యాల | ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి | కొమురం భీం ఆసిఫాబాద్ | మహబూబాబాద్
ఆదివారం
6 సెప్టెంబర్ 2026
పేజీలు - 12

# రణరంగంగా మారిన భూపాలపల్లి!

- ఒకే చోట రెండు పార్టీల కార్యక్రమాలు..
- ఉద్రిక్తతతకు దారితీసిన వైనం..
- కాంగ్రెస్ విజయోత్సవంలో బీఆర్ఎస్ అత్యుత్సాహం..
- వెయ్యి రోజుల ప్రజాపాలన సంబరాలకు పోటీగా 'దగా పాలన' నిరసన..
- అంబేద్కర్ సెంటర్‌లో నినాదాల హోరు..
- కాంగ్రెస్ సభ వద్దకు దూసుకొచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు..
- పరిస్థితిని అదుపులోకి తెచ్చిన పోలీసులు..







**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** వెయ్యి రోజుల ప్రజాపాలన విజయోత్సవాలతో భూపాలపల్లి కాంగ్రెస్ శ్రేణులు కదంతొక్కితే.. దాన్ని అడ్డుకునేలా బీఆర్ఎస్ అత్యుత్సాహం ఉద్రిక్తతకు దారితీసింది. అధికార కాంగ్రెస్ భారీ ర్యాలీ, రోడ్‌షోతో ప్రజల్లోకి వెళ్తున్న వేళ.. అదే ప్రాంతంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ నిరసనకు దిగడంతో భూపాలపల్లి జిల్లా కేంద్రం ఒక్కసారిగా రాజకీయ వేడితో రగిలిపోయింది. కాంగ్రెస్ సభ అంబేద్కర్ సెంటర్‌లో కొనసాగుతుండగానే బీఆర్ఎస్ కార్యకర్తలు రోడ్డుపైకి వచ్చి కాంగ్రెస్ కాన్వాయ్ వెనుక వైపు చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరుపార్టీల శ్రేణులు పోటాపోటీగా నినాదాలు చేయడంతో అంబేద్కర్ కూడలి దద్దరిల్లింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించి ఇరువర్గాలను కట్టడి చేశారు.

**కదం తొక్కిన కాంగ్రెస్.. -హోరెత్తిన భూపాలపల్లి..**

వెయ్యి రోజుల ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా కాంగ్రెస్ శ్రేణులు శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో భారీ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, డీసీసీ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ నేతృత్వంలో హనుమాన్ టెంపుల్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ, రోడ్‌షో చేపట్టారు. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో ప్రధాన రహదారులు సందడిగా మారాయి. కాంగ్రెస్ ఉదయం 11 గంటల నుంచి కార్యక్రమానికి అనుమతి తీసుకుని విజయోత్సవాలను నిర్వహించింది. అయితే కార్యక్రమం కొంత ఆలస్యం కావడంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అదే స్థలానికి రావడం ఉద్రిక్త వాతావరణానికి దారి తీసింది. ప్రజాపాలనలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ కాంగ్రెస్ నేతలు సభను కొనసాగిస్తుండగా.. మరోవైపు బీఆర్ఎస్ 'వెయ్యి రోజుల దగా పాలన' పేరుతో నిరసనకు సిద్ధమైంది. బీఆర్ఎస్ కార్యక్రమానికి ఉదయం 12 గంటలకు అనుమతి ఉన్నప్పటికీ కాంగ్రెస్ కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభం కావడంతో రెండు కార్యక్రమాలు ఒకే ప్రాంతంలో ఎదురుపడే పరిస్థితి ఏర్పడింది.

**కాంగ్రెస్ సభ వద్దకు బీఆర్ఎస్ శ్రేణులు.. ఒక్కసారిగా టెన్షన్..**

మధ్యాహ్నం 1.30 గంటలు దాటినా అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ సభ కొనసాగుతుండటంతో ఊర్వశి థియేటర్ వద్ద వేచి ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తల్లో అసహనం వ్యక్తమైంది. దీంతో వారు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి కాంగ్రెస్ కాన్వాయ్ వెనుక వైపు చేరుకున్నారు. దీంతో అక్కడ ఉన్న కాంగ్రెస్ శ్రేణుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. కాంగ్రెస్ కార్యక్రమం జరుగుతున్న ప్రాంతానికి బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకోవడంతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఇరువర్గాల మధ్య ఎలాంటి ఘర్షణ చోటుచేసుకోకుండా వారిని వెనక్కి పంపేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఇరుపార్టీల శ్రేణులు పరస్పరం నినాదాలు చేయడంతో పరిస్థితి క్షణాల్లో ఉద్రిక్తంగా మారింది.

**నినాదాలతో దద్దరిల్లిన అంబేద్కర్ సెంటర్..**

ఒకవైపు కాంగ్రెస్ శ్రేణుల విజయోత్సాహం.. మరోవైపు బీఆర్ఎస్ నిరసన మిగతా 16లో..

# డిజిటల్ రీ-సర్వేతో భూ సమస్యలకు చెక్!

- రైతుల భూముల వద్దకే అధికారులు..
- ఖచ్చితత్వంతో సర్వే పూర్తి చేయాలి..
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..
- 70 గ్రామాల ఎంపిక.. 12 గ్రామాల్లో కొనసాగుతున్న రీ-సర్వే..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** డిజిటల్ భూ రీ-సర్వేతో భూ సమస్యలకు చెక్ పెట్టడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత, కచ్చితత్వం పెంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గణపురం మండలం అప్పయ్యపల్లి గ్రామపంచాయతీ శివారు తూపురం వద్ద కొనసాగుతున్న డిజిటల్ భూ రీ-సర్వే పనులను శనివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే అధికారులు, సిబ్బందితో మాట్లాడి రీ-సర్వే పురోగతిని, అనుసరిస్తున్న విధానాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం అక్కడి రైతులతో మాట్లాడి సర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. భూ రీ-సర్వే పనులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత ఖచ్చితత్వంతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. జిల్లాలో రీ-సర్వే కోసం 70 గ్రామాలను ఎంపిక చేయగా, ప్రస్తుతం 12 గ్రామాల్లో సర్వే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. మిగిలిన గ్రామాల్లోనూ సర్వే పనులను వేగవంతంగా ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న సర్వేయర్ల భద్రతకు అవసరమైన గమ్‌షూస్‌తో పాటు ఇతర రక్షణ పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా రోవర్ తదితర ఆధునిక సర్వే పరికరాలను సమర్థవంతంగా ఉపయోగిస్తూ భూముల కొలతల్లో కచ్చితత్వం సాధించాలని, సర్వే పనులను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. గణపురం మండలంలో ఆరు గ్రామాలను రీ-సర్వే కోసం ఎంపిక చేయగా ప్రస్తుతం మూడు గ్రామాల్లో రీ-సర్వే కొనసాగుతోందని వివరించారు. రీ-సర్వే ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్రతి రైతుకు వారి భూమికి సంబంధించిన స్పష్టమైన భూధార్ సంఖ్యతో పాటు భూ మ్యాపులు అందుబాటులోకి మిగతా 16లో..



# మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులకు కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశం

**బాసర, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం బాసరలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం బాసరలో పర్యటించిన ఆయన శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం, గోదావరి పరిసర ప్రాంతాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. పార్కింగ్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం భైంసా తహసీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను కలెక్టర్ తనిఖీ చేశారు. నోటీసుల జారీ, తదుపరి ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్లకు అవగాహన కల్పించి వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. పలువురు ఓటర్లతో స్వయంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, ఆలయ ఈఓ అంజనాదేవి, తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్ పర్సన్‌గా గుండు సుధారాణి



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 5 (జనం సాక్షి)** పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయికుడా చైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుండు సుధారాణికి అభినందనల వెల్లువ కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా గుండు సుదారాణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండలోని కుడా కార్యాలయంలో నిర్వహించిన పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా....ఛాంబర్‌లో అధికారికంగా కుడా చైర్ పర్సన్‌గా గుండు సుధారాణి పదవీ బాధ్యతలు చేపట్టారు. వరంగల్ పశ్చిమ, స్టేషన్ ఘన్‌పూర్, పరకాల ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కుడా వైస్ చైర్మన్/ హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, జి డబ్ల్యు ఎం సి కమిషనర్ వెంకన్న, తదితరుల సమక్షంలో కుడా చైర్ పర్సన్‌గా గుండు సుధారాణి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన గుండు సుధారాణికి ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, జి డబుల్ ఎంసీ కమిషనర్, పుష్పగుచ్చాలు, పూల మొక్కలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కుడా చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గుండు సుదారాణి మాట్లాడుతూ... తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కుడా పరిధిలో పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, వివిధ శాఖల అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొని నూతనంగా కుడా చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుండు సుధారాణికి అభినందనలు తెలిపారు.

## యువతను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్: చల్లా ధర్మారెడ్డి

- కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనపై బీఆర్ఎస్ పోరుబాట
- పరకాలలో అంబేద్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ
- అంబేద్కర్ సెంటర్లో ధర్నా..పోలీసుల అత్యుత్సాహంతో తోపులాట
- విద్యార్థులను అడ్డుకున్న పోలీసుల తీరుపై చల్లా ధర్మారెడ్డి ఆగ్రహం



**పరకాల,సెప్టెంబర్05,(జనం సాక్షి):** ఎన్నికల ముందు యువతకు అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను గాలికొదిలేసిందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మండిపడ్డారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి యువత తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా నాలుగో రోజు పరకాల పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ కూడలి వరకు సాగి తిరిగి అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుంది. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు స్వచ్ఛందంగా ర్యాలీలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. అయితే ర్యాలీలో పాల్గొనేందుకు వస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడంపై చల్లా ధర్మారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "విద్యార్థులను చూస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఎందుకంత భయం? ప్రశ్నించే గొంతులను అడ్డుకోవడం చేతగాని పాలనకు నిదర్శనం" అని విమర్శించారు.

**హామీలు ఎక్కడ రేవంత్‌రెడ్డి?**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా యువతను మోసం చేస్తోందని చల్లా ధర్మారెడ్డి ఆరోపించారు.

నిరుద్యోగులకు నెలకు రూ.4,000 భృతి ఏమైంది? తొలి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయి? జాబ్ క్యాలెండర్ ఎక్కడ? యూత్ కమిషన్ ఏర్పాటు ఏమైంది? విద్యార్థులకు రూ.10 లక్షల వడ్డీలేని రుణాలు ఎక్కడ? విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఏమయ్యాయి? రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు ఎక్కడ? ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి? ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు విదేశీ విద్య కోసం రూ.25 లక్షల ఆర్థిక సహాయం ఎక్కడ?

**బీఆర్ఎస్ హయాంలో విద్యారంగానికి పెద్దపీట**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టామని చల్లా ధర్మారెడ్డి తెలిపారు. 294 నుంచి 1,000కు పైగా గురుకులాలు, జూనియర్ కళాశాలలు, ప్రత్యేక మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేశామని చెప్పారు. 'మన ఊరు--మన బడి', 'మన బస్తీ--మన బడి' కింద రూ.7,900 కోట్లతో పాఠశాలల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేశామని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లతో పాటు కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు, యూనివర్సిటీల బలోపేతం చేపట్టామని పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే, అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకాల ద్వారా విదేశీ విద్యకు ఒక్కో విద్యార్థికి రూ.20 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు.

జీఓ 97ను వెంటనే రద్దు చేయాలి. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జీఓ 97ను వెంటనే రద్దు చేయాలని చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తుతో ఆడుకుంటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు. విద్యార్థులకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం.. ప్రజాక్షేత్రంలో నిలదీస్తాం" అని చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, యువజన నాయకులు, విద్యార్థులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాటారం కేజీబీవీ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం




**కాటారం సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :**కేజీబీవి కాటారంలో ఈరోజు సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరుపుకోవడం జరిగింది. ముందుగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి గౌరవ వందనం సమర్పించడం జరిగింది. తదుపరి విద్యార్థినీలు ఉపాధ్యాయినిలందరిని శాలువాలతో సత్కరించడం జరిగింది. ప్రిన్సిపాల్ చల్ల సునీత పాఠశాలలో అంకితభావంతో పనిచేస్తున్న కళాశాల ఫిజిక్స్ అధ్యాపకురాలు యన్.శిరీష పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయిని జి.నళిని , పి.ఇ.టి రాజేశ్వరి ని ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి శాలువా కప్పి పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. విద్యార్థినీలు గురువుల గురించి పాటలు నృత్యాలు ఉపన్యాసాలు ఇవ్వడం జరిగింది. అనంతరం ప్రిన్సిపాల్ చల్ల సునీత రచించిన గురువు గొప్పదనం పాటని ప్రిన్సిపాల్ ఉపాధ్యాయ బృందం ఆలపించడం జరిగింది. ప్రిన్సిపాల్ చల్ల సునీత మాట్లాడుతూ గురువు దైవం తో సమానం అంటూ గురువుల మాట ఆలకించి చక్కగా చదువుకోవాలని విద్యార్థినీ లకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చల్ల సునీత విజయ శిరీష నళిని కవిత శ్రీలత సుజాత, స్వప్న సరిత , అరుణ , మణిమాల , రాజమణి , మౌనిక రాజేశ్వరి , శ్రావ్య , లక్ష్మి , రిబ్కా , విద్యార్థినీలు పాల్గొన్నారు.

## యోగాసన పోటీలను విజయవంతం చేయాలి

### తెలంగాణ యోగ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కరుణాకర్ రావు




**కాటారం సెప్టెంబర్ 5 (జనం సాక్షి ):** కాటారం మండల కేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌లో ఈ నెల 6న నిర్వహించే జిల్లా స్థాయి యోగాసన పోటీలను విజయవంతం చేయాలని తెలంగాణ యోగ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు జనగామ కరుణాకర్‌రావు కోరారు. శనివారం కాటారం డీఎస్పీ కార్యాలయంలో జిల్లా స్థాయి యోగాసన పోటీల పోస్టర్లను డీఎస్పీ సూర్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనగామ కరుణాకర్‌రావు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటాలని కోరారు. పోటీల్లో పాల్గొనే వారికి ఉచిత రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. యోగా సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, విద్యార్థులు చిన్ననాటి నుంచే యోగాను అలవర్చుకోవాలని అన్నారు. జిల్లా స్థాయి యోగాసన పోటీలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా అథ్లెటిక్స్ చైర్మన్ పంతకాని సమ్మయ్య, యోగ సాధకులు మధు, కుమార్ యాదవ్, డాక్టర్ రఫీ, అంగజాల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఊరేగింపు ,గోపాల కాలువలు



**కాళేశ్వరం , సెప్టెంబర్ 05 , ( జనం సాక్షి )** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో గోకులాష్టమి సందర్భంగా శ్రీ రామాలయం నుండి ఊరేగింపు సేవ మొదలై గ్రామ వీధుల గుండా కొనసాగింది. అనంతరం గోపాల కాలువలు ఉట్టి కొట్టు కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్ మహేష్ ,సర్పంచ్ వెన్నపు రెడ్డి మోహన్ రెడ్డి. ధర్మకర్తలు గందేసిరి సత్యనారాయణ, సీతయ్య, అశోక్, కుంభం పద్మ, మంచినీళ్ల దుర్గయ్య, భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

## ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి



**ములుగు ప్రతినిధి,సెప్టెంబర్ 05(జనంసాక్షి).**అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార దినాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి కోరారు.శనివారం ప్రత్యేక ప్రచార దినం సందర్భంగా గోవిందరావుపేట మండలంలోని గోవిందరావుపేట, చల్వాయి, తాడ్వాయి మండలంలోని తాడ్వాయి, కాటాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో కృష్ణవేణి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఓటర్ల ముసాయిదా జాబితాలు, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించి బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు.ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, వివరాల సవరణలకు సంబంధించిన దరఖాస్తులు, అభ్యంతరాలను నిర్ణీత నమూనా పత్రాల్లో స్వీకరించాలని ఆదేశించారు. అర్హులైన ఏ ఒక్కరూ ఓటరుగా నమోదు కాకుండా మిగిలిపోకుండా బూత్ స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.సెప్టెంబర్ 6, 12, 13 తేదీల్లో కూడా ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా తేదీల్లో బూత్ స్థాయి అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి ఓటర్లకు సహకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు తమ పోలింగ్ కేంద్రాలను సందర్శించి నిర్ణీత గడువులో దరఖాస్తులు, అభ్యంతరాలను సమర్పించాలని కోరారు.నూతన ఓటరు నమోదుకు నమూనా--6, ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించేందుకు నమూనా--7, వివరాల సవరణకు నమూనా--8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2026 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే యువతీ యువకులు నిర్ణీత ప్రకటన పత్రంతోపాటు నమూనా--6ను సమీపంలోని బూత్ స్థాయి అధికారికి సమర్పించి ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.ప్రజల భాగస్వామ్యంతో తప్పులులేని సమగ్ర ఓటర్ల జాబితా రూపుదిద్దుకుంటుందని, తద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని ఆర్డీవో కృష్ణవేణి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గోవిందరావుపేట తహసీల్దార్ సృజన్ కుమార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నితీష్, తాడ్వాయి సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర, బూత్ స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# క్రిషి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్కూల్ బాలికలకు సైకిళ్ళ పంపిణీ



**ఆత్మకూర్, సెప్టెంబర్ 5 (జనం సాక్షి):** నీరుకుళ్ళ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో టీచర్స్ డే సందర్భంగా,క్రిషి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హైస్కూల్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకి సన్మాన కార్యక్రమం చేశారు.తదుపరి కార్యక్రమం క్రిషి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం పాఠశాలలోని బాలికలకు 7 సైకిల్లు పంపిణీ చేశారు. హై స్కూల్ బాలికలకు సైకిల్ అందజేయడానికి మన్విత ఎన్.ఆర్.ఐ సహకారం అందించారు,అలాగే ఇదే పాఠశాలలో చదువుకున్న ఎన్ఆర్ఐ లు బొంపెల్లి సతీష్, పొనుగోటి మురారి సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు గతంలో విద్యార్థులకు నోట్ బుక్స్, స్టడీ మెటీరియల్స్, పెన్సిల్, పెన్నులు అలాగే ప్రాథమిక ఉన్నత పాఠశాలలో కూడా స్కూల్ పిల్లలకు పెన్నులు, పెన్సిల్స్ అందించారు. క్రిషి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పొనుగోటి సత్యనారాయణ మాట్లాడుతూ, ఇలాగే పలు స్కూళ్లలో సేవా కార్యక్రమాలు విద్యార్థులకు నోట్ బుక్స్ కంటి అద్దాలు ఒ లైబ్రరీ మెటీరియల్ అందించడం జరిగిందన్నారు.అలాగే నీరుకుళ్ళ పాఠశాల క్రీడాకారులకు నేను కూడా నా వంతుగా స్కూల్ పిల్లలకి సాయం చేస్తానంటూ ముందుకు వచ్చి స్కూలు పిల్లలకు, నీలం రాజు వాలీబాల్ స్పోర్ట్స్ టీ షర్ట్స్ అందించారు. రాజు మాట్లాడుతూ క్రిషి స్వచ్ఛందసంస్థ చేస్తున్నటువంటి కార్యక్రమాలు చాలా అద్భుతంగా ఉన్నాయని ఆయన కొనియాడారు. అలాగే హై స్కూల్ హెచ్ఎం నిర్మల మేడం మాట్లాడుతూ విద్యార్థులకు సహకారం చేస్తున్న క్రిషి స్వచ్ఛంద సంస్థ వారికి కృతజ్ఞతలు తెలిపారు, ఇలాంటి కార్యక్రమాలు ఇక మునుముందు ఇంకా చేయాలని ఆమె కోరారు అలాగే నీరుకుళ్ళ గ్రామ సర్పంచ్ తడుక నీరజ శ్రీనివాస్ మాట్లాడుతూ నీరుకుళ్ళ హైస్కూలో చదువుకొని ఎంతో ఎత్తుకు ఎదిగి ఒక స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి పేద పిల్లలకి ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో, గ్రామ ఉప సర్పంచ్ కిన్నెర ప్రేమ్చంద్, అమ్మ ఆదర్శ పాఠశాల అక్కల రుద్రమ, మాజీ సర్పంచ్ అర్షం బలరాం, గ్రామం పెద్దలు పిట్టల రాజమౌళి, గణిత శాస్త్రం టీచర్ రమేష్, అమ్మ కోమల, గ్రామ నాయకులు, అర్షం కుమార్ స్వామి, పొనుగోటి శ్రీనివాస్, వార్డ్ నెంబర్, నాగరాజు, ఉడత రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జన ప్రదేశాల్లో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి



**వరంగల్ ఎంజీఎం, సెప్టెంబర్ 5 (జనంసాక్షి):**నిమజ్జన ప్రదేశాల్లో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిడబ్ల్యూఎంసి కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.వినాయక నవరాత్రి ఉత్సవాల అనంతరం నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ పరిధిలోని నిమజ్జన ప్రదేశాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లను శనివారం క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఉర్సుగుట్ట చెరువు, బంధం చెరువు, నిమజ్జన పాయింట్లను ఇంజనీరింగ్ శానిటేషన్ అధికారులతో కలిసి కమిషనర్ సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.నిమజ్జన ప్రదేశాలకు వెళ్లే ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులను పరిశీలించి, అవసరమైన చోట్ల రోడ్డు మరమ్మతులు, గుంతల పూడ్చివేత, రహదారుల చదును, లైటింగ్, చెరువులలో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత వంటి పనులను వెంటనే పూర్తి చేసి ఈనెల 14వ తేదీలోగా సిద్ధంగా ఉండాలని సూచించారు. నిమజ్జన సమయంలో వాహనాల రాకపోకలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున రహదారులు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అదేవిధంగా నిమజ్జన ప్రదేశాల పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ సూచించారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు చేపట్టాలని, నిమజ్జనానికి ముందు మరియు అనంతరం పారిశుధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.నిమజ్జన ప్రదేశాల్లో భక్తులు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ముందుగానే ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ వెంకన్న స్పష్టం చేశారు. ముఖ్యంగా భక్తులు నిమజ్జన ప్రదేశాలకు చేరుకునే సమయంలో, తిరిగి వెళ్లే సమయంలో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని తెలిపారు.ప్రజలు, భక్తుల సౌకర్యం మరియు నగర పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ నిమజ్జన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లన్నీ సకాలంలో, సమర్థవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మహేందర్, సంతోష్ బాబు, రవికుమార్, మాధవి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దొంతికి మంత్రి పదవి రావాలని ప్రత్యేక పూజలు



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 5 ( జనం సాక్షి ):** నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి మంత్రి పదవి రావాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం మండలంలోని ఉప్పరపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామంలోని శ్రీ రామ లింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెరుమాండ్ల మల్లారెడ్డి, పెరుమాండ్ల సుధన్ రెడ్డి, బల్గూరి నరేందర్ రెడ్డి, కాసాని రమేష్, వట్టె రవికిరణ్ రెడ్డి, కోత్వాల రాజు, పోలాటి గణపతి రెడ్డి, వల్లెపు మహేందర్ రెడ్డి, కొయ్యడి ఎల్లగౌడ్, దొనకొండ కరుణాకర్ రెడ్డి, మేడిపెల్లి అశోక్, కట్కూరి రాజిరెడ్డి, వట్టె కరుణాకర్ రెడ్డి, రెండేడ్ల బుచ్చిరెడ్డి , సామల సంపత్, అనుమాండ్ల నాగరాజు, గుళ్ళపెల్లి వెంకన్న, రెడ్డబోయిన శ్రీశైలం, గణేష్ , వెంకన్న, దామరకొండ బ్రహ్మచారి, మేడిపెల్లి అశోక్, కళింగాచారి, ఈర్ల రమేష్, ముత్యాల రాజగౌడ్ ,చిలపాక మల్లయ్య, పాల్గొన్నారు.

# ఘనంగా పోషకాహార వారోత్సవాలు



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 5 ( జనం సాక్షి):** మండలంలోని 16 చింతల తండ గ్రామం లోని అంగన్వాడి కేంద్రం లో ఘనంగా పోషకాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలకు, నవజాత శిశువు ఎదుగుదలకు కావలసిన పౌష్టిక విలువలు కలిగిన పోషక ఆహార పదార్థాలు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు , పాలు, గుడ్లు అన్నిటిని వారికి చూపిస్తూ అందులో ఉండే విటమిన్లు, లవణాలు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్ల గురించి వివరించారు. అలాగే చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోతు విక్రమ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని సరోజ, ఉప సర్పంచ్ రమేష్, ఏఎన్ఎం కవిత, హెల్త్ అసిస్టెంట్లు సురేందర్, సార్య నాయక్, లింగమూర్తి, అంగన్వాడీ టీచర్ దేవి, రాములు తండా అంగన్వాడి టీచర్ మంచోజు మంజుల, ఆశ కార్యకర్త స్వరూప, వార్డు సభ్యులు బానోతు మాలి, కేశ్య, రామోజీ, తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపుపై కలెక్టర్‌కు ఎర్రబెల్లి వినతి



**దేవరుప్పుల, సెప్టెంబర్ 5 (జనం సాక్షి).** డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపులో ఎలాంటి రాజకీయ జోక్యానికి తావులేకుండా అర్హులైన నిరుపేదలను గుర్తించి పారదర్శకంగా ఇళ్లు కేటాయించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతిపత్రం అందజేశారు. దేవరుప్పుల మండలాల్లోని అర్హులైన పేదలను గుర్తించి డ్రా పద్ధతిలో పారదర్శకంగా డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయించాలని కోరారు. కాంగ్రెస్ కార్యకర్తలకు అనుకూలంగా ఇళ్ల కేటాయింపులు చేయకూడదని స్పష్టం చేశారు. పేదల ఇళ్ల విషయంలో రాజకీయాలు చేయకుండా అర్హులైన ప్రతి నిరుపేదకు న్యాయం చేయాలని అన్నారు.అర్హులకు న్యాయం జరగకపోతే వేలాది మందితో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఎర్రబెల్లి అన్నారు .ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తీగల దయాకర్‌గౌడ్, కార్యదర్శి చింత రవి, , సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల నెల్లికుదురులో గురుపూజోత్సవం



**తొర్రూరు/నెల్లికుదురు సెప్టెంబర్ 05 :** ప్రభుత్వ జూనియర్ కళాశాల నెల్లికుదురులో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మర్సకట్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ కె. వీరస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కె. వీరస్వామి మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులకు కేవలం విద్యాబోధన చేయడమే కాకుండా, క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, దేశభక్తి వంటి విలువలను పెంపొందించడంలో గురువులు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే గురుపూజోత్సవం ఉపాధ్యాయుల పట్ల విద్యార్థుల్లో గౌరవం, కృతజ్ఞతా భావాలను పెంపొందిస్తుందని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మర్సకట్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ గురువులు విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడంతో పాటు, జీవితంలో సరైన మార్గాన్ని చూపించే మార్గదర్శకులని అన్నారు. విద్యార్థులు తమ గురువులను గౌరవిస్తూ, వారు చూపిన మార్గంలో నడిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సన్మానించి గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్, ప్రకాష్ బాబు, నాగేశ్వరావు, శ్రీనివాస్, రామ్మూర్తి , మహేందర్, సుధాకర్, బాబు, సతీష్ అధ్యాపకేతర సిబ్బంది ప్రదీప్, లక్ష్మణ్, గౌరీశంకర్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# వినాయక చవితి వేడుకల్లో విద్యుత్ భద్రతే అత్యంత ప్రాధాన్యత ఎస్ఈ బి బిక్షపతి స్పష్టం



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 05(జనంసాక్షి)** గణేష్ మండపాలు, నిమజ్జన మార్గాల్లో ప్రత్యేక తనిఖీలు, విద్యుత్ ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ములుగు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి.బిక్షపతి స్పష్టం చేశారు. ఈ నెల 14న వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ మండపాల ఏర్పాటు, విద్యుత్ అలంకరణలు, విగ్రహాల తరలింపు, నిమజ్జనం సమయంలో ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రజలు, భక్తులు, మండప నిర్వాహకులు, విద్యుత్ ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

“పండుగ వేడుకల్లో ఆనందం ఎంత ముఖ్యమో, ప్రతి ఒక్కరి ప్రాణ భద్రత అంతకంటే ముఖ్యం. ఒక చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతకంగా మారే అవకాశం ఉన్నందున విద్యుత్ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలి” అని ఎస్ఈ స్పష్టం చేశారు.

**నిమజ్జన మార్గాల్లో విద్యుత్ సిబ్బందికి ప్రత్యేక సూచనలు**

విగ్రహాల ఎత్తు, ట్రక్కులు, క్రేన్ల ఎత్తును దృష్టిలో ఉంచుకుని నిమజ్జన మార్గాలను విద్యుత్ సిబ్బంది ముందుగానే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు.

మార్గంలోని విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర విద్యుత్ పరికరాలను తనిఖీ చేయాలి.

ప్రమాదకరంగా లేదా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్లను గుర్తించి అవసరమైన సాంకేతిక చర్యలు చేపట్టాలి.

నిమజ్జన మార్గాల్లో మార్గాల పరిశీలన పూర్తి చేసి, సంబంధిత అధికారుల ద్వారా ముందస్తుగా ధృవీకరించాలి.

క్రేన్లు, భారీ వాహనాలు, ఎత్తైన విగ్రహాలు విద్యుత్ లైన్లకు తగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

**ప్రజలకు, మండపం నిర్వహులకు పలు సూచనలు**

విద్యుత్ లైన్లకు దగ్గరగా గణేష్ విగ్రహాలు, క్రేన్లు, మెటల్ ఫ్రేములు లేదా ఇతర అలంకరణ సామగ్రిని తీసుకెళ్లడం ప్రమాదకరమని, జాగ్రత్తగా, దూరంగా తీసుకువెళ్లాలని కోరుతున్నారు.

విద్యుత్ తీగను నేరుగా తాకకపోయినా దగ్గరగా వెళ్లడం వల్ల విద్యుత్ ప్రసరణ/ఇండక్షన్ కారణంగా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. కాబట్టి విద్యుత్ లైన్లకు సురక్షిత దూరం పాటించడం తప్పనిసరి. మండపాలు, నిమజ్జన మార్గాలు, ప్రధాన రహదారుల్లో ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ఈ సమయంలో ఎక్కడైనా తెగిపోయిన విద్యుత్ తీగలు , లూజ్ లైన్లు,విద్యుత్ స్తంభాలు, ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే ప్రజలు వాటిని తాకకూడదు.

వెంటనే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరుతున్నారు.

గణేష్ మండపాల నిర్వాహకులు విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేసేటప్పుడు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని చెప్పారు.

విద్యుత్ కనెక్షన్‌ను అధికారిక విద్యుత్ సిబ్బంది ద్వారానే పొందాలి.

నాణ్యమైన,మార్క్ కలిగిన వైర్లు, పరికరాలను మాత్రమే ఉపయోగించాలి.

సరైన సామర్థ్యం కలిగిన వీజదీ/రక్షణ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి.

జాయింట్లు, దెబ్బతిన్న వైర్లు, టేప్‌తో తాత్కాలికంగా చేసిన కనెక్షన్లను ఉపయోగించరాదు.

విద్యుత్ వైరింగ్‌ను నీరు, తేమకు దూరంగా ఉంచాలి.

వర్షం పడినప్పుడు తడిసిన వైర్లు, స్విచ్‌లు, విద్యుత్ పరికరాలను తాకరాదు.

పిల్లలను విద్యుత్ స్తంభాలు, వైర్లు, విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంచాలి.

మండపాల వద్ద మెటల్ నిర్మాణాలు విద్యుత్ లైన్లకు దగ్గరగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

**కేబుల్ వైర్లపై ప్రత్యేక దృష్టి**

టీవీ, ఇంటర్నెట్ తదితర కేబుల్ వైర్లు విద్యుత్ స్తంభాలపై చిందరవందరగా లేదా తక్కువ ఎత్తులో వేలాడుతూ ఉండకుండా సంబంధిత కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు.

పండుగ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇలాంటి వైర్లను ప్రత్యేకంగా తనిఖీ చేసి ప్రమాదకర పరిస్థితులను తొలగించాలని సూచించారు.

**విద్యుత్ భద్రత , ప్రతి ఒక్కరి బాధ్యత**

విద్యుత్ భద్రతా నియమాలు పాటిస్తూ, టీజీఎన్పీడీసీఎల్‌కు సహకరించి వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ఆనందంగా, ముఖ్యంగా ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు లేకుండా సురక్షితంగా నిర్వహించుకోవాలని ప్రజలకు ఎస్ఈ విజ్ఞప్తి చేశారు.

# గజ్జలమ్మ గుడి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలన భైంసా ఏడిఈకి గ్రామస్తుల వినతి



**కుంటాల , సెప్టెంబర్ 5 ( జనం సాక్షి ):** కుంటాల మండల కేంద్రంలోని ప్రసిద్ధ గజ్జలమ్మ దేవాలయం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను భైంసా విద్యుత్ శాఖ ఏడిఈ చాట్ల మోహన్ కుమార్ శనివారం పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, సదరు ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతానికి షిఫ్టింగ్ (మార్పిడి) చేయాలని ఈ సందర్భంగా స్థానిక గ్రామస్తులు కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఏడిఈ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక విద్యుత్ శాఖ ఏఈ జుట్టు విష్ణు,గ్రామ పెద్దలు తోట రఘు, సక్రపు గజేందర్, అర్థపు శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




**స్టేషన్ ఘన్‌పూర్,సెప్టెంబర్ 05(జనం సాక్షి) :** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్టేషన్ ఘన్‌పూర్ మండల కేంద్రంలో ఏఐ ఎస్ఎఫ్, ఐవైసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవవేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఏఐఎస్ఎఫ్, ఐవైసీ నాయకులు ఘనంగా సన్మానించి, శాలువాలతో సత్కరించారు. సమాజ నిర్మాణంలో, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని నాయకులు పేర్కొ న్నారు.విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను నేర్పిస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జనగామజిల్లా కన్వీనర్ మొహమ్మద్ యూనుస్, ఐవైసీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జానీ బాబా, రామ్ చరణ్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# పెద్దతుండ్లలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

## ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ మలహాలరావు



**మల్హర్, సెప్టెంబర్ 05( జనం సాక్షి)** మండలంలోని జడ్పీహెచ్ఎస్ పెద్దతుండ్ల పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ మలహల్ రావు, సర్పంచ్ బండారి నర్సింగం, ఉపసర్పంచ్ తాళ్ళ రవీందర్, వార్డు సభ్యులు బండ విష్ణువర్ధన్, వంశీ,కేశవచారి, సంధ్యారాణి రవీందర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొని జెడ్పిహెచ్ఎస్ పెద్దతూండ్ల పిఎస్ పెద్దతూండ్ల,గాదంపల్లి, నారాయణ పల్లి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు బి తిరుపతి,ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పానుగంటి మానస ,సిహెచ్ శర్మ,ఎండి యాకూబ్ పాషా, ఐత మహేందర్ ,అజ్మీర గోపి నాయక్ ,తోట చంద్ర ప్రకాష్, రమేష్, శివ కృష్ణ, సరిత, సబిత ,రామయ్య, సంతోష్ మరియు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# నూతన సిఐని కలిసిన మండల బిఆర్ఎస్ సర్పంచుల ఫోరం



**నడి కూడ సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** పరకాల పోలీస్ స్టేషన్ కు నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్ కుమార్‌ను నడి కూడ మండల బిఆర్ఎస్ ఫోరం సర్పంచులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ నేర రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పోలీసులు ప్రజాప్రతినిధులు ఐక్యమత్యంతో ముందడుగు వేస్తేనే గ్రామాలు నేర రహిత గ్రామాలుగా తీర్చ దిద్దవచ్చని గ్రామాలలో ప్రథమ పౌరులు పోలీస్ వారికి సహకరించాలని తెలియజేశారుఈ కార్యక్రమంలో నడికూడ మండల బీఆర్ఎస్ ఫోరం అధ్యక్షులు దొగ్గెల కుమారస్వామి, మేకమల్ల వెంకటేష్, సర్పంచుల జిల్లా ప్రచార కార్యదర్శి. బండి రేణుక శంకర్ చర్లపల్లి , కోడేపాక , ముత్యాలు ఐలయ్య నర్సక్కపల్లి . ఓదెల. శ్రీలత భాస్కర్, కౌకొండ సర్పంచ్ పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పిన్నింటి బాలాజీ రావు



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 5 ( జనం సాక్షి):** రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పిన్నింటి బాలాజీ రావు శనివారం అందుకున్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ లో నిర్వహించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు కార్యక్రమంలో వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పిన్నింటి బాలాజీ రావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేశవరావు, ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానా, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్, టెక్నికల్ ఎడ్యుకేషన్ సెక్రెటరీ శ్రీదేవి సేన, రాజశేఖర్, హనుమంతరావు,ఇతర ఉన్నతాధికారుల చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు.బాలాజీ రావు గైడ్ టీచరుగా వ్యవహరిస్తూ 8సార్లు విద్యార్థులను ఇన్స్పైర్, ఆర్ బి వి పి, జవహర్లాల్ నెహ్రూ సైన్స్ ఎగ్జిబిషన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యేల ప్రోత్సహించారు..తెలంగాణ ప్రభుత్వంచే 2014లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో పాటు రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్, పలు ఉపాధ్యాయ స్వచ్ఛంద సంస్థల చేత ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందారు.తాను పనిచేసిన పాఠశాలల్లో గత 28 సంవత్సరాల నుండి పాఠశాలలను సమాజానికి అనుసంధానం చేసే దిశగా కమ్యూనిటీ మొబిలైజేషన్ కార్యక్రమాలను చేపట్టారు. దాతల సహకారంతో లక్షలాది రూపాయల విలువైన వసతులు, సామాగ్రిని పలు పాఠశాలలకు సమకూర్చారు.తరుణి స్వచ్ఛంద సంస్థ జిల్లా రిసోర్స్ పర్సన్ గా బాల్య వివాహాలు, ఎయిడ్స్ నివారణ కార్యక్రమాలు 100 గ్రామాల్లో నిర్వహించారు.కౌమరవిద్యా కార్యక్రమం , ఎయిడ్స్ నివారణ విద్యా కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించి వందలాది పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కలిగించారు.ఉన్నతి, దీక్ష, డిపెప్, క్లాప్స్, క్లిప్, అభ్యసనాభివృద్ధి కార్యక్రమం తదితర విద్యా సంబంధ కార్యక్రమాలకు జిల్లా రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించారు.ఐదు రోజులపాటు గాంధీనగర్ ఐఐటీలో శిక్షణ పొంది అతి తక్కువ ఖర్చుతో టీఎల్ఎం లను తయారు చేసే విధానాన్ని నేర్చుకొని , సివి రామన్ సైన్స్ క్లబ్ ఏర్పాటు చేసి విద్యార్థులతో అనేక బోధనోపకరణాలు తయారు చేయించారు. సబ్జెక్టు రిసోర్స్ పర్సన్ గా వ్యవహరిస్తూ గత కొన్ని సంవత్సరాలుగా వేలాదిమంది విద్యార్థులకు పదో తరగతి పరీక్ష విధానాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బాలాజీ రావు ను వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, ఎంఈఓ పాపమ్మ, సీఎమ్ఓ డాక్టర్ కట్ల శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి సురేష్ బాబు, హెచ్ఎం. జయ, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

# మహిళల భద్రత, టీ -సేఫ్ అప్ పై అవగాహన

## షీ టీం ఎస్సై రామారావు అవగాహన



**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 05 (జనం సాక్షి):** నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో అందరు భాగస్వామ్యం కావాలని తమవంతు బాధ్యతలను నిర్వర్తించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల మహిళల మీద జరిగే నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ షీ టీమ్ ఎస్సై రామారావు అన్నారు. హన్మకొండ లోని అవినాష్ కాలేజీ లో దాదాపు 150మంది విద్యార్థినిలతో సైబర్ నేరాలు, మహిళలపై జరిగే అత్యాచారాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ సందర్భంగా వరంగల్ షీ టీమ్ ఎస్సై రామారావు మాట్లాడుతూ అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్, స్నాప్ చాట్, టెలిగ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాల పై,అవగహన కలిగివుండాలని మరియు మహిళలు ఒంటరిగా తెలియని ప్రదేశాలకు ప్రయాణం చేయవలసి వచ్చినప్పుడు అందరు టీ-సేఫ్ ఆప్ ను ఉపయోగించుకోవాలని, టీ-సేఫ్ ఆప్ పై అవగాహన కలిగి ఉండాలని, ఉద్యోగాలు చేసే మహిళలకు తాము పనిచేసే ప్రదేశాలలో అసభ్యకరంగా ప్రవర్తించే వారి పట్ల, ఆకతాయుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వారితో తమ వ్యక్తిగత విషయాలు పంచుకోరాదని సూచించారు. ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా వెంటనే షీ టీమ్ పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ1930 కి ఫిర్యాదు చేయాలని, మా షీ టీమ్ మొబైల్ నంబర్స్ సీపీ గారి వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270కు ఫిర్యాదు చేసిన వారి వివరాలను చాలా గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అవినాష్ కాలేజీ ప్రిన్సిపాల్ షహీన్ మరియు ఉపాధ్యాయులు మరియు షీ టీమ్ ఎస్సైగారు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాయామ ఉపాధ్యాయులను విస్మరించడం సరికాదు

## ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పెనక ప్రభాకర్

**గూడూరు,సెప్టెంబర్04(జనంసాక్షి):** ఒక టీచరు కేవలం పాఠాలు బోధించే వ్యక్తి మాత్రమే కాదని,విద్యార్థి జీవితానికి దిశా నిర్దేశం చేసే మార్గదర్శి,మంచి విలువలు నేర్పే గురువని ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పెనుక ప్రభాకర్ కొనియాడడారు. ఈసందర్భంగా పెనక ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి ఏటా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా నిజాయితీగా, బాధ్యతగా అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయులకు వారి సేవలు కొనియాడుతూ వారిని ప్రోత్సహించేందుకు ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వడం ఆనవాయితని,గత అకాడమీక్ విద్యా సంవత్సరం 100శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలకు ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులకు అవార్డు ఇచ్చి ప్రోత్సహించడం మేము స్వాగతిస్తున్నామని,కానీ ఇదే గిరిజన సంక్షేమ పాఠశాలలో అంకిత భావంతో పనిచేసే సెకండరీ గ్రేడ్ టీచర్స్,వ్యాయామ ఉపాధ్యాయులను ఎందుకు విస్మరించడం జరిగిందని అధికారులను ప్రశ్నించారు. పంచాయతీరాజ్ విద్యాశాఖలో మండల,జిల్లా, రాష్ట్రస్థాయిలో సెకండరీ గ్రేడ్ టీచర్స్ మరియు వ్యాయామ ఉపాధ్యాయులని ప్రోత్సహించి అవార్డులు అందిస్తే,గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులను కించపరచడం ఎంతవరకు సరైనది అని అన్నారు.ఐటీడీఏ ఉట్నూరు,భద్రాచలంలో పనిచేసే సెకండరీ గ్రేడ్ టీచర్స్ వ్యాయామ ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇచ్చి ప్రోత్సహిస్తుంటే ఐటీడీఏ ఏటూరునాగారం ఉపాధ్యాయులు ఏం పాపం చేశారని ప్రశ్నించారు.ఇటీవల స్పోర్ట్స్ డేకు అతిథులుగా కొత్త గూడకు విచ్చేసిన ఐటీడీఏ పీవో కి అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయులకు అవార్డులు ప్రధానం చేయాలని ఆట తరపున వినతిపత్రం అందించగా వారు సానుకూలంగా మాట ఇచ్చారని,మరి ఎక్కడ లోపం జరిగిందనేది వాదన అధికారులకు గిరిజన విద్య వ్యవస్థ పై ఎందుకు వివక్ష? అధికారులే అవార్డుకు కావలసిన డాక్యుమెంట్లతో ఆఫీసులో సమర్పించాలని దీనికి ఒక కమిటీ వేయడం ఇదంతా నాటకమేనా? విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచినప్పటికీ ఇంకా కొన్ని పాఠశాలలో సబ్జెక్ట్ టీచర్స్ లేరనేది వాస్తవమని,ఇంతవరకు ఏతుబద్దీకరణ చేయకుండా నిర్లక్ష్యం చేయడం వలన ఏజెన్సీ గిరిజన విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని దీనిపై త్వరలో మంత్రిని,కలెక్టర్, ఐటీడీఏ పిఓ ని సంఘం ఆధ్వర్యంలో కలుస్తామని అయన అన్నారు



# శ్రీ సిద్దేశ్వర ఆలయంలో అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలి

## పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తుల వినతి



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 5 ( జనం సాక్షి):** మండల కేంద్రంలోని శ్రీ సిద్దేశ్వర ఆలయంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని చెన్నారావుపేట గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీ సిద్దేశ్వరాలయంలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాన్ని అడ్డుకున్నారు. గ్రామ ప్రజలందరి సహకారంతో నిర్మించుకున్నటువంటి శ్రీ సిద్దేశ్వర ఆలయంలో కొంతమంది వ్యక్తులు వయోవృద్ధుల సంక్షేమం సంఘం అని పెట్టి అందులో అక్రమ నిర్మాణం చేపడుతున్నారన్నారు. వెంటనే అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి సుప్రజకు వినతి పత్రాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హంస విజయరామరాజు, మాజీ ఉపసర్పంచ్ జున్నుతుల మహేందర్ రెడ్డి, వార్డు సభ్యులు రాసమల్ల రజిత సతీష్, గట్ల రాంబాబు, చిట్టె రవికుమార్, దొంతి బాబు, తోట రాము, జాలి రాజేందర్ రెడ్డి, మహమ్మద్ భాష, తదితరులు పాల్గొన్నారు.

# పండుగ ఆఫర్ల లింకులతో జాగ్రత్త

## కుబీర్ ఎస్సై కృష్ణారెడ్డి




**కుబీర్, సెప్టెంబర్ 05, (జనంసాక్షి):** వినాయక చవితి పండుగ సందర్భంగా సోషల్ మీడియాలో వచ్చే నకిలీ ఆఫర్లు, డిస్కౌంట్ లింకుల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కుబీర్ మండల ఎస్సై కృష్ణారెడ్డి సూచించారు. పండుగ సీజన్ను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో మోసాలకు పాల్పడే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాట్సాప్, ఫేస్బుక్ వంటి సామాజిక మాధ్యమాలలో ప్రముఖ కంపెనీల పేర్లతో వచ్చే గుర్తుతెలియని, అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని కోరారు. ఉచిత బహుమతులు, భారీ డిస్కౌంట్ల ఆశ చూపి ఖాతాలను ఖాళీ చేసే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు తమ వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా సమాచారం, క్రెడిట్, డెబిట్ కార్డ్ నంబర్లు, ఓటీపీలను ఎవరికీ వెల్లడించవద్దని స్పష్టం చేశారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని ఎస్సై కృష్ణారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# దళిత నాయకుడి సభ ముగిశాక 'శుద్ధీకరణ' చేస్తారా

## కుబీర్ పీఎస్‌లో బీజేపీ నేతలపై కాంగ్రెస్ ఫిర్యాదు



**కుబీర్, సెప్టెంబర్ 5, (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన మైదానాన్ని 'శుద్ధీకరణ' చేయడాన్ని నిరసిస్తూ కుబీర్ పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. కుబీర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీసులకు ఈ మేరకు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. గత ఆగస్టులో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రామ్‌లీలా మైదానంలో మల్లికార్జున ఖర్గే బహిరంగ సభ నిర్వహించారు. అయితే, ఆయన ఒక దళిత నాయకుడు అనే కారణంతోనే సభ ముగిసిన తర్వాత కొందరు అక్కడ 'శుద్ధీకరణ' కార్యక్రమం నిర్వహించారని కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అమానుష చర్యను సమర్థించిన ఉత్తరాఖండ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్ర భట్‌తో పాటు, ఆ కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తులందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బషీర్, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ బంక బాబు యాదవ్, ఆత్మ డైరెక్టర్ దుగ్గే సందీప్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గడపాలే దమ్మ పాల్, నాయకులు ఏరేకర్ విజయ్, రమేష్, జమ్మే దయానంద్, ఆడే జైవంత్, బంక రాములు, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

# వెంకటాపురం మండలంలో హోరెత్తిన గులాబీ జోరు

## రాంబాబు ఆధ్వర్యంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్



**నూగూర్ వెంకటాపురం సెప్టెంబర్ 5(జనం సాక్షి ):-** వెంకటాపురం మండలంలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ పుంజుకుంది. మండల అధ్యక్షులు గంప రాంబాబు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం గులాబీ జోరు హోరెత్తింది. మండలంలోని వివిధ గ్రామాల నుండి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చి బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలో ఇండియన్ ఆయిల్ బంక్ దగ్గర నుండి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా సాగింది. కార్యకర్తలు గులాబీ జెండాలు చేతబట్టి "జై తెలంగాణ, జై కేసీఆర్, జై కేటీఆర్" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

**రాంబాబు ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం:**

అనంతరం జరిగిన సమావేశంలో మండల అధ్యక్షులు గంప రాంబాబు మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పాటు నుండి నేటి వరకు గిరిజన, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి పాటుపడింది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని అన్నారు. కేసీఆర్ హయాంలోనే పోడు భూములకు పట్టాలు, దళిత బంధు, గిరిజన బంధు, రైతు బంధు వంటి పథకాలు వచ్చాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వెంకటాపురం మండలంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి, యూత్ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువత,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలి

- జీవో 97ను తక్షణమే రద్దు చేయాలి
- విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడొద్దు




**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన సందర్భంగా రాష్ట్రంలో విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఓరుగల్లు గడ్డపై భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున కదిలి ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. హనుమకొండలోని ఏకశిలా పార్కు నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు విద్యార్థులు, యువత భారీ ర్యాలీ నిర్వహించారు. చేతుల్లో ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి, జీవో 97ను రద్దు చేయాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన--ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను పెండింగ్‌లో ఉంచి వారి విద్యకు ఆటంకం కలిగించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. ఈ భారీ ర్యాలీకి విద్యార్థులు, యువత నుంచి విశేష స్పందన లభించింది. వేలాది మంది విద్యార్థులు ర్యాలీలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. "ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలి", "జీవో 97ను రద్దు చేయాలి", "విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి" అంటూ నినాదాలతో హనుమకొండ మార్మోగింది. విద్యార్థుల హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయడంతో పాటు, విద్యార్థుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం, యువత హక్కుల కోసం ఓరుగల్లు గడ్డపై ప్రారంభమైన ఈ పోరుబాటను మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌లోని డీఆర్వోకి వినతిపత్రం అందజేశారు

# రామప్ప దేవాలయంలో సోమసూత్ర పునరుద్ధరణ





**వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబర్05(జనం సాక్షి):-**యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయం గర్భాలయంలో అభిషేకాల అనంతరం అభిషేక జలాన్ని బయటకు పంపేందుకు ఉద్దేశించిన ప్రాచీన సోమసూత్రాన్ని భారత పురావస్తు సర్వేక్షణ (ఏఎస్ఐ), హైదరాబాద్ సర్కిల్ విజయవంతంగా పునరుద్ధరించింది. దశాబ్దాల కాలం క్రితం సోమసూత్రం మూసుకుపోవడం వల్ల ఆగమ శాస్త్ర ప్రకారం అభిషేకాలు నిర్వహించడానికి ఆటంకం ఏర్పడింది. ఈ పునరుద్ధరణ పనులను విధ్వంసం లేని,శాస్త్రీయ పరిరక్షణ పద్ధతులను అవలంబించి చేపట్టారు ఆధునిక పరికరాల ఉపయోగించారు. ఈ ప్రక్రియలో అంతర్గత అడ్డంకులకు సంబంధించి శాస్త్రీయ 3డి మ్యాపింగ్, ఎండోస్కోపిక్ కెమెరాలు మరియు గోప్రో కెమెరాలతో రియల్-టైమ్ మానిటరింగ్ స్క్రీన్ల ద్వారా తనిఖీ,దేవాలయ అసలు నిర్మాణానికి ఎటువంటి నష్టం కలగకుండా సాఫ్ట్-డ్రిల్లింగ్ విధానంలో పొరలు పొరలుగా అడ్డంకులను జాగ్రత్తగా తొలగించడం జరిగింది. ఈ పనులు తెలంగాణ ప్రభుత్వ దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో, ఏఎస్ఐ హైదరాబాద్ సర్కిల్ బృందం ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించబడ్డాయి. పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. ఇప్పుడు సోమసూత్రం పూర్తిగా పనిచేసే స్థితిలో ఉంది, భక్తులు ఎటువంటి ఆటంకం లేకుండా ఆగమ శాస్త్ర ప్రకారం అభిషేకాలు నిర్వహించుకోవచ్చు. పాల్గొన్న అధికారులు పురావస్తు శాఖ డీఈ కృష్ణ చైతన్య, సీఏ లు మల్లేష్,అజిత్, వంశీకృష్ణ,దేవాదాయ శాఖ ఈవో ఇమ్మడి భాస్కర్ తథితరులు ఉన్నారు.

# డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదిన వేడుకలు

## ప్రధానోపాధ్యాయులు ముయ్యబోయిన వెంకన్న




**గూడూరు,సెప్టెంబర్05(జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చర్ల బేతంచెర్ల ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వెంకన్న మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 1888 సెప్టెంబర్ 5న తమిళనాడులోని తిరుతనిలో జన్మించారని, ఆయన జన్మదినాన్ని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటారని అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగంలో చాలా ముఖ్యమైన పాత్ర పోషించారని,1952 నుంచి 1962 మధ్య ఉపరాష్ట్రపతిగా పనిచేశారని,1962 నుంచి 1967 వరకు భారతదేశనికి రెండవ రాష్ట్రపతిగా,తన 16వ ఏటా శివ నాయకమ్మను వివాహం చేసుకున్నారని,1954 సంవత్సరంలో భారతరత్న అవార్డు పొందారని అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 1975 ఏప్రిల్ 17న, మరణించారని విద్యార్థులకు తెలిపారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువాతో ఘనంగా సత్కారించినారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రేగ సాంబయ్య, అంగన్వాడి ఆయా కొట్టెం పూలమ్మ, విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి మేడంకు బెస్ట్ టీచర్ అవార్డు



**మహబూబాబాద్, సెప్టెంబర్ 05(జనం సాక్షి):** మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల బాలికల కళాశాల బోటనీ లెక్చరర్‌గా పనిచేస్తున్న కృష్ణవేణి మేడమ్‌కు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విశిష్ట పురస్కారానికి ఎంపికయ్యారు. గత సంవత్సరం కళాశాలలో ఇంటర్మీడియట్ 100 శాతం ఫలితాలు సాధించి, మరియు పలువురు విద్యార్థులకు ఎంసెట్ , నీట్ వచ్చేలా కృషి చేసి విద్య మరియు సంక్షేమం కోసం కృషి చేస్తున్నందుకు గాను ఆమెకు ఈ గుర్తింపు దక్కింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆర్సిఓ లక్ష్మీనారాయణ నాయక్ మరియు ప్రిన్సిపల్ నాగేంద్రమ్మ వైస్ ప్రిన్సిపాల్ చేతుల మీదుగా జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడుకల్లో, ఈ ప్రతిష్టాత్మక అవార్డును కృష్ణవేణికి అందజేశారు. ఈ అవార్డు రావడం పట్ల కళాశాల సిబ్బంది, మార్గదర్శి బీఈడీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఉమ్మగాని అరుణ్ కుమార్ విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విధి నిర్వహణలో నిబద్ధత చూపిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచినందుకు పలువురు ప్రజా ప్రతినిధులు అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలిపారు.

# 1000 రోజుల కాంగ్రెస్ దగా పాలనపై

## బీఆర్ఎస్ నాయకులు సమరభేరి



**పెద్ద వంగర సెప్టెంబర్ 05 (జనంసాక్షి )** యువత, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం శనివారం తొర్రూర్ మున్సిపాలిటీలో జరుగుతున్నా బీఆర్ఎస్ పార్టీ భారీ బైక్ ర్యాలీ మండలంలో రాష్ట్ర మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో పెద్దవంగర నుండి భారీ ఎత్తున బైక్ ర్యాలీ తో బయలుదేరిన బీఆర్ఎస్ యువత మోటర్ బైక్ ర్యాలీని ప్రారంభించిన బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఈదురు ఐలయ్య మండల ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ సంజయ్ , మండలయూత్ అధ్యక్షుడు కాన్వాయిగూడెం సర్పంచ్ కాసాని హరీష్,ఈ కార్యక్రమంలో వెనుక దాసుల రామచంద్రయ్య శర్మ, సోమ నరసింహారెడ్డి, గాంధీ నాయక్, వెంకన్న శ్రీరాం సుధీర్, యువ నాయకులు అనపురం రాజు, అనీల్ కార్తీక్,తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోండి

## జోగంపల్లి లోని మిషన్ భగీరథ నీటి శుద్ధీకరణ ప్లాంటు పరిశీలన

### కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**శాయంపేట, సెప్టెంబర్ 5 (జనం సాక్షి)**:శాయంపేట మండలంలోని గ్రామాలకు తాగునీటి సరఫరాలో ఎక్కడ కూడా సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శాయంపేట మండలం జోగంపల్లిలోని మిషన్ భగీరథ తాగునీటి శుద్ధీకరణ ప్లాంట్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రా వాటర్ ఎక్కడినుండి వస్తుందని, నీటి సరఫరా పరిస్థితి ఎలా ఉందని, పంపుల పనితీరు, క్లోరినేషన్, ఇన్‌ట్రా డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ, పంపింగ్ తీరు తదితర అంశాలను సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మండలంలోని 26 గ్రామాలకు రోజుకు ప్రస్తుతం సుమారు 5.35 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన అన్ని పంపులు పని చేసే స్థితిలో ఉన్నాయా, ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినప్పుడు వెంటనే వినియోగించేందుకు స్టాండ్‌బై పంపులు, ప్రత్యామ్నాయ పరికరాలు అందుబాటులో ఉన్నాయా అని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు సురక్షితమైన తాగునీరు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.నీటి సరఫరా వ్యవస్థలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని వెంటనే గుర్తించి పరిష్కరించాలని, ప్రత్యామ్నాయ నీటి వనరులు, అదనంగా పరికరాలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని సూచించారు.ప్రజలకు తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. చలి వాగు కు సంబంధించిన చెక్ డ్యామ్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. చెక్ డ్యామ్ ద్వారా వరద నీరు సాఫీగా వెళ్లే విధంగా చేపట్టనున్న మరమ్మతు పనుల గురించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఇంట్రా ఆర్డబ్ల్యూఎస్ ఈఈ గాయత్రి, వాటర్ గ్రిడ్ ఈఈ సురేందర్, సాగునీటిపారుదల శాఖ ఈఈ సునీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### మాజీ మంత్రి: డిఎస్ రెడ్యానాయక్



**నర్సింహులపేట, సెప్టెంబర్ 05(జనంసాక్షి)**: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మైదం దేవేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ మాట్లాడుతూ గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజుల్లోనే ఇచ్చిన హామీలను అమలుపరుస్తామని ప్రచారం చేసిన ప్రభుత్వం ఇప్పుడు మాట తప్పిందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం కొద్ది నెలల్లోనే కుప్పకూలనున్నట్లు తెలిపారు.రైతులకు 24 గంటలు కరెంటు ఇస్తామని మాయమాటలు చెప్పి రోజుకు నాలుగు గంటలు కోత విధిస్తున్నారన్నారు. యువతకు నిరుద్యోగ భృతి నెలకు 4 వేల రూపాయలు ఇస్తామని,మహిళలకు స్కూటీలు అందజేస్తామని, రైతులకు రెండు పంటలకు బోనస్ అందజేస్తామని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్కటి అమలు చేసిన దాకా లేవని తెలిపారు. గ్రామస్థాయిలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను ప్రజలకు వివరించాలని వచ్చేది మన ప్రభుత్వమే అని అన్నారు.ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చి ప్రజలకు సమాధానం చెప్పాలని డిఎస్ రెడ్యా నాయక్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నెలకుర్తి సత్తిరెడ్డి,సోమేశ్వరరావు, నరసింహారెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ దేవేందర్ నాయక్, వంతడపల సర్పంచ్ బాలు నాయక్, నాయక్,యువజన నాయకులు బండి రమేష్,మారపంగు వీరన్న, మంచాల శ్రీశైలం,నాయకులు పటేల్ రామన్న,వంశీ,వీరన్న, గుగులోత్ రవి,మాజీ సర్పంచులు,ఎంపీటీసీలు, గ్రామపార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించిన కేశిరెడ్డి రాకేష్ రెడ్డి



**స్టేషన్ ఘన్‌పూర్,సెప్టెంబర్ 05 (జనం సాక్షి)**:ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకు ని చిల్పూర్ మండలంలోని రాజావరంలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బీఆర్ ఎస్ పార్టీ జనగామ యువజన నాయకులు కేశిరెడ్డి రాకేష్ రెడ్డి, సీనియర్ నాయకులు జనగామ యాదగిరి, సర్పంచ్ మోటం రాజు ఆధ్వర్యంలో శనివారం పాఠశాలలో పనిచేస్తు న్న 20మంది ఉపాధ్యాయులను శాలువాల తో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు కేశిరెడ్డి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్య త్తు తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమనిఅన్నారు.విద్యార్థులకు విద్య తో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు పట్ల, సమాజం పట్ల బాధ్యతను నేర్పుతున్న ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. కస్తూర్బాగాంధీ బాలికల పాఠ శాలలో విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యా యులందరికీ ఆయన ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలోమాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రంగు హరీష్ , ఎడ్ల మహిపాల్ , రంగు రవి , ఎడ్ల రాజేష్, పురాణం శంకర్,భైరగోని మల్లయ్య, పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది తదితరులు పాల్గొ న్నారు.

# సీతానగరం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

## స్పీచ్ తో అందర్నీ ఆకర్షించిన రెండవ తరగతి విద్యార్థి భాను భవ్యేష్



**గూడూరు,సెప్టెంబర్05(జనంసాక్షి)**: ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు గూడూరు మండలం సీతానగరం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జీవితం అందరికీ ఆదర్శనీయమని, పిల్లలు ఆయన మార్గాన్ని.ఒక లక్ష్యంగా ఎంచుకొని భవిష్యత్తులో స్థిరపడాలని ప్రధానోపాధ్యాయులు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు.శనివారం గూడూరు మండలం సీతా నగరం ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దినోత్సవం సందర్భంగా ఆయన చిత్ర పటం వద్ద పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించినారు.ఈ కార్యక్రమంలో సహ ఉపాధ్యాయురాలు చర్ప దేవి, అంగన్వాడి టీచర్ కమల,శ్రీలత, హెల్త్ డిపార్ట్మెంట్ ఈశ్వరి, రమ్య, కవిత, పద్మ, తల్లిదండ్రులు : నాగమణి, ఆయా: వీరమ్మ లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



**శాయంపేట ,సెప్టెంబర్ 5 (జనం సాక్షి)**:భారత మాజీ రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని శాయంపేట మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఎంపీడీవో ఫణి చంద్ర హాజరై మాట్లాడుతూ... ఉపాధ్యాయుల సేవలను, సమాజ నిర్మాణంలో వారి కీలక పాత్రను కొనియాడారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో గొప్పదని పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జి బిక్షపతి , స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీలత , మాందారి పేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ , పిఆర్టియుపిఎస్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోట రాజ యుగేందర్ , బానోతు సుధాకర్ రాథోడ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యార్థులే అధ్యాపకులుగా

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వయం పరిపాలన దినోత్సవం



**దిలావర్‌పూర్, సెప్టెంబర్ 5 (జనం సాక్షి)**:మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే అధ్యాపకులుగా, వివిధ బాధ్యతలు చేపట్టి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విశ్రాంత ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాధ్యమిక విద్యాశాఖ అధికారులు సి. హెచ్. ప్రభాకర్, బి. నాగేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ.."నేటి విద్యార్థులే నవ భారత నిర్మాతలు. స్వయం పరిపాలన వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, నిర్ణయాత్మక సామర్థ్యం, బాధ్యతాయుత ప్రవర్తనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.అనంతరం కళాశాల బోధన, బోధనేతర సిబ్బందిని విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. సుదర్శన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మారేపు కృష్ణ, సీనియర్ అధ్యాపకులు రామారావు, ఇతర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కుప్టి ఘాట్‌లో వరుస ప్రమాదాలు



**నేరడిగొండ సెప్టెంబర్ 5(జనంసాక్షి)**: మండలంలోని కుప్టీ ఘాట్ ప్రమాదాలకు నిలయంగా మారింది.పాత బ్రిడ్జి మరమ్మతుల కారణంగా రహదారిపై వాహనాల రాకపోకలను ఒకే వైపు నుంచికొనసాగిస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. శుక్రవారం కుప్టీ ఘాట్ వద్ద మరో రోడ్డు ప్రమాదం జరిగింది.నిర్మల్ నుంచి టమాటా లోడుతో ఆదిలాబాద్ వైపు వెళ్తున్న యూపి75 సిటీ3707 నంబర్ గల ట్యాంకర్, ఎదురుగా వెళ్తున్న ఐచర్ వాహనాన్ని ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ఐచర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.కుప్టీ ఘాట్ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో ఈ రహదారిపై ప్రయాణించాలంటేనే వాహనదారులు,ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు..పాఠశాల బస్సులు సైతం సమయానికి రాకపోవడంతో విద్యార్థులు ఆలస్యంగా పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.కుప్టీ ఘాట్ రహదారి మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేసి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# ఉపాధ్యాయులే సమాజ నిర్మాణానికి మార్గదర్శకులు

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు
- మండల ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు




**టేకుమట్ల, సెప్టెంబర్ 5 జనంసాక్షి** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా నిలుస్తారని మండల విద్యాధికారి చిదిరాల సుధాకర్ అన్నారు. శనివారం టేకుమట్ల మండల కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్పెషల్ గెస్ట్‌గా ఎంపీడీవో వసంత రామ్ , తహసీల్దార్ స్వరూప రాణి, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ వెలిశాల ప్రసాద్, పీజీహెచ్ఎం గర్మిళ్లపల్లి రాము తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో విద్యార్థుల విద్యాభివృద్ధికి, పాఠశాలల అభివృద్ధికి, విధుల పట్ల అంకితభావంతో విశిష్ట సేవలు అందించిన 15 మంది ఉత్తమ ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బందిని మండల బెస్ట్ టీచర్స్ అవార్డులతో సత్కరించారు. ఎంపికైన వారికిఎంపీడీఓ వసంత రామ్ , తహసీల్దార్ స్వరూప రాణి, ప్రసాద్, రాము తదితరుల చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

**ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారు**

పి. రాము జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల గరిమిలపల్లి పీజీ హెచ్ఎం

కుసుమ గిరిబాబు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల వెలిశాల -- స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)

వి. పంకజ-- హెచ్ఎం పి హెచ్ ఎస్ టేకుమట్ల స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)

ఈ. రమేష్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల వెంకట్రావుపల్లి (బి ) స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)

మామిడి ప్రకాష్ హెచ్ఎం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల టేకుమట్ల -- స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)

ఎస్. మల్లయ్య జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల గర్మిళ్లపల్లి స్కూల్ అసిస్టెంట్ (హిందీ)

బెక్కంటి కవిత -- కేజీబీవీ టేకుమట్ల సి ర్ టీ (హిందీ)

చాగంటి ఆనంద్ హెచ్ఎం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల టేకుమట్ల -- స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)

ఎస్. తిరుపతి -- ఎంపీపీ స్ వెలిశాల హెడ్‌మాస్టర్

తోట మహేందర్ -- ఎంపీపీ ఎస్ టేకుమట్ల -- సెకండరీ గ్రేడ్ టీచర్

గంపల స్వామి -ఎంపీపీ ఎ స్ గరిమిల్లపల్లి -సెకండరీ గ్రేడ్ టీచర్

ఎస్. స్వామి-ఎంపీపీ ఎ స్ వెంకట్‌రావుపల్లి - సెకండరీ గ్రేడ్ టీచర్

జి. రాధిక ఎంపీపీ ఎ స్ అరేపల్లి (ర్ ) సెకండరీ గ్రేడ్ టీచర్

వి. కుమార్ - ఎం ఆర్ సి టేకుమట్ల

ఎస్. నాగరాజు సి ఆర్ సి వెలిశాల సి ఆర్ పి

అభినందనకు ఎంపికైన వారు

టి. మోసెస్ హెచ్ఎం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల టేకుమట్ల -- స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)

శంకర్ రావు - ఎంపీపీ ఎ స్ టేకుమట్ల హెడ్‌మాస్టర్

పి. రవి టేకుమట్ల ఎం ఆర్ సి మెసెంజర్

అనంతరం అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను అధికారులు, సహచర ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, విద్యార్థుల్లో జ్ఞానం, క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గొప్ప బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

# పూర్వ విద్యార్థి సహకారం అభినందనీయం

- క్రీడా దుస్తులను అందిస్తున్న సి ఐ.
- గార్ల బయ్యారం సి ఐ రవీందర్.



**బయ్యారం సెప్టెంబర్ ( జనంసాక్షి)** కన్న తల్లిదండ్రులను పుట్టిన ఊరును చదువుకున్న పాఠశాలను మరిచిపోకూడదనేది ఒకనానుడి. ఈ నానుడిని నిజం చేస్తూ తాను చదువుకున్న పాఠశాలలోని విద్యార్థులకు క్రీడా దుస్తులను బహూకరించి పాఠశాల పై తనకున్న మమకారాన్ని చాటుకున్నాడు ఓ పూర్వ విద్యార్థి. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1992- 93 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన కలకోట వెంకట నరసయ్య కుమారుడు కలకోట నారాయణరావు విదేశాల్లో స్థిరపడ్డాడు. ఈ మధ్యకాలంలో స్వగ్రాం వచ్చిన సందర్భంగా పాఠశాలను సందర్శించి గత స్మృతులను నెమరు వేసుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులకు విద్యార్థులకు ఏదైనా అవసరం వస్తే సహకారం అందిస్తారని ఇచ్చిన హామీ మేరకు పాఠశాలలోని విద్యార్థులకు 25 వేల రూపాయల విలువైన కబడ్డీ, కోకో, వాలీబాల్ స్పోర్ట్స్ కు సంబంధించిన క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గార్ల బయ్యారం సి ఐ ఎల్ రవీందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలను అక్కడి విద్యార్థులను మరిచిపోకుండా వారికి తన వంతు సహాయం అందించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించెందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహద పడతాయని అన్నారు. పూర్వ విద్యార్థులు తామ చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తే విద్యార్థులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. చదువుతోపాటు క్రీడల్లో విద్యార్థులు రాణించాలని క్రీడలు శారీరక దారుడ్యంతోపాటు, క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడలపై మక్కువ చూపడం ద్వారా చెడు అలవాట్లకు దూరంగా ఉండటానికి దోహదపడుతుందని తెలిపారు. పాఠశాల పై ఉన్న అభిమానంతో విద్యార్థులకు క్రీడా దుస్తులను అందించిన పూర్వ విద్యార్థి కలకోట నారాయణరావును ఆయన తండ్రి వెంకట నరసయ్యను సి ఐ అభినందించారు. అనంతరం పాఠశాల ఉపాద్యాయ బృందం, సి ఐ ,రవీందర్ ను,వెంకట నరసయ్య ను, తిరుమల వెంకటరెడ్డి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనుంజయ ఉపాధ్యాయులు రవీందర్ నాయక్, లక్ష్మీనారాయణ,కొలిపాక శ్రీనివాసరావు, రామేశ్వరరావు, గలిగే దస్తగిరి, బూర్గ సుధాకర్ ,రచ్చ వెంకటేశ్వర్లు,బెల్లిలక్ష్మయ్య, హథిరాం, శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ సునీత, అరుణ శోభాకుమారి,సర్వేశ్, కళావతి,నజీమ, సైదాబి,పాల్గొన్నారు.

# సీఐని కలిసిన తెలంగాణ ఉద్యమకారులు



**ఆత్మకూర్, సెప్టెంబర్ 5 (జనం సాక్షి):** ఆత్మకూర్ పోలీస్ స్టేషన్లో నూతన సీఐ జి. బాబులాల్‌ని కలిసి తెలంగాణ ఉద్యమకారులఫోరమ్ ఆత్మకూరు మండల కమిటీ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించారు. 2001 నుండి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నాయకులు అందరూ మండల కేంద్రంలో కలుసుకొని అన్ని గ్రామాల ఉద్యమకారులు అందరు కలిసి సిఐ బాబులాల్‌ని సన్మానించారు. తెలంగాణ ఉద్యమకారులందరికీ అండదండలుగా ఉండాలని స్థానిక సీఐని కోరారు. అనంతరం సిఐ బాబులాల్ మాట్లాడుతూ ఉద్యమకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని అందరూ శాంతి భద్రతలకు కట్టుబడి ఉండాలని అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని గ్రామాల్లో ఏదైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతే తమకు సమాచారం అందించాలని ఆయన ఉద్యమకారులందరినీ కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్సండ్ల సదానందం ఆత్మకూరు మండల అధ్యక్షులు ఎండి బాబుమియా (చిరు) మండల ప్రధాన కార్యదర్శి దొంక దువ్వ రాజన్న, ఆత్మకూరు అధ్యక్షులు భాష బోయిన సాగర్, నీరుకుళ్ళ అధ్యక్షులు పసుల లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచులు అక్కల కుమారస్వామి, చిట్టే రవి, మాజీ మార్కెట్ డైరెక్టర్ కాకాని శ్రీధర్, ప్రతాప్ రెడ్డి,మంద రవి, నాగేల్లి స్వామి, హుస్సేన్, బలభద్ర కిషోర్ తదితరులు అందరూ పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం

**బీజేపీ నేత.డా.పేసరు విజయచందర్ రెడ్డి**



**ఆత్మకూరు, సెప్టెంబర్ 5 (జనం సాక్షి):** ఆత్మకూర్ మండల కేంద్రానికి చెందిన బీజేపీ కార్యకర్త కొమ్ము మయాకర్ తండ్రి కొమ్ము చిన్ని ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంచార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి, కొమ్ము చిన్ని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ, కొమ్ము చిన్ని మృతి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు తీరని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తల కుటుంబాలకు బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఆత్మకూర్ మండల అధ్యక్షులు ఉప్పుగళ్ళ శ్రీకాంత్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు సదానందం, మాజీ జెడ్పీటీసీ టీంగిలికారి సత్యనారాయణ, ముల్క ప్రసాద్, వంగాల బుచ్చిరెడ్డి, వాడి రాజు, వాడికారి రమేష్, భయ్యా మాలగం, వరికెల రామకృష్ణతో పాటు కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోతుల రహిత పంచాయతీగా వెంకట్రాంపురం



**బయ్యారం సెప్టెంబర్ 5( జనంసాక్షి)** వెంకట్రాంపురం గ్రామ పంచాయితీ మండలంలో మొదటి కోతుల రహిత గ్రామపంచాయతీగా నిలబడింది. ఈ నాడు రాష్ట్రవ్యాప్తంగా కోతుల బెడద ఎంతతీవ్రంగా ఉందో అందరికీ తెలిసిన విషయమే. ఈ నేపథ్యంలో అనేక గ్రామ పంచాయతీ పాలక వర్గాలు కోతుల బెడద నుంచి ప్రజలను రక్షించడానికి శ్రమిస్తున్న విషయం పత్రికల్లో చూస్తూనే ఉన్నాం. ఈ నేపథ్యంలో వెంకట్రామ్ పురం సర్పంచ్ యువకుడు,విద్యావంతుడు అయిన ధరావత్ శివాజీ గ్రామంలో ప్రజలను కోతుల బెడద నుంచి రక్షించాలనె ఆలోచనతో లక్షల రూపాయలు ఖర్చు బెట్టి 1200 కోతులను పట్టి అడవుల్లో వదిలి వేశారు. గ్రామస్తులు సర్పంచ్ ని అభినందించారు. ఈ సంధర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నా పై విశ్వాసం ఉంచి సర్పంచ్ గా గెలిపించిన ప్రజలకు వీలయినంత సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు.

# ముడుపులు ముడితేనే ఇంటి నంబర్లు

## పంచాయతీ కార్యాలయాల్లో దళారుల దందా

## రూ.20 నుంచి రూ.30 వేల చొప్పున వసూళ్లు



**వెంకటాపూర్ (రామప్ప),సెప్టెంబర్ 5(జనం సాక్షి):**-వెంకటాపూర్ మండలంలో పేదోళ్ల ఇళ్ల స్థలాల చుట్టూ కొత్త దందా మొదలైంది. ఇంటి నంబర్ ఇప్పిస్తామంటూ కొందరు మధ్యవర్తులు రూ. 20 వేల నుంచి 30 వేల వరకు వసూళ్లు చేస్తున్నట్లు తెలిసింది.పలు గ్రామపంచాయతీల్లో డబ్బులిస్తేనే ఫైల్ ముందుకు కదులుతుందనే పరిస్థితి నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు. మండలంలోని ఓ రెండు గ్రామ పంచాయతీలల్లో పనిచేస్తున్న అధికారులు అక్కడి మధ్యవర్తులతో కలిసి ఈ అక్రమానికి తెరలేపినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను అమ్ముకోవాలనుకునే వారిని, కొనాలనుకునే వారిని ప్రధానంగా టార్గెట్ చేస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా బ్యాంక్ లోన్ వస్తుందని నమ్మపలుకుతూ పాత రికార్డుల్లోకి కొత్త ఇంటిని చేర్చి నంబర్లు కేటాయిస్తున్నట్లు తెలిసింది. అంతేకాకుండా అధికార దుర్వినియోగం చేస్తూ వారికి అనుకూలంగా ఉన్న వారికి పలు ధ్రువీకరణ పత్రాలను సృష్టిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ వ్యవహారంపై ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.ఇదే తరహాలో గతంలో మండలంలోని ఓ గ్రామపంచాయతీ అధికారి అక్రమాలకు పాల్పడి సస్పెండ్ అయ్యారు. ఇప్పుడు సైతం అదే తరహాలో సీన్ రిపీట్ అవుతోంది. పంచాయతీ రూల్స్ తెలియని అమాయకులను ఆసరాగా చేసుకొని దళారుల సహాయంతో కొంతమంది అధికారులు రూ.లక్షల్లో దండుకుంటున్నారు. ఈవిషయమై సంబంధిత శాఖ అధికారులను వివరణ కోరగా, అక్రమాలపై విచారణ జరుపుతామని,బాధ్యులను గుర్తించి వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏదేమైనప్పటికీ గ్రామాల్లో అమాయక ప్రజలే లక్ష్యంగా చేసుకొని కొంతమంది అధికారులు అక్రమంగా సంపాదిస్తున్నప్పటికీ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే అదనగా భావించిన సదరు అధికారులు గ్రామపంచాయతీల్లో తమ దందాను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి వెంకటాపూర్ మండలంలో కొనసాగుతున్న అవినీతి అక్రమాలపై చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# కలెక్టరేట్ లో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు

## జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 6 (జనం సాక్షి)** :విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాది వేసే ప్రతి ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయురాలు ఉత్తములేనని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి జ కలెక్టర్ పూలమాల వేసి..జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ. ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాన్నే కాకుండా సమాజాన్ని, భవిష్యత్ తరాన్ని ఉత్తమ మార్గం వైపు మార్చగలరని, నడిపిస్తారని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాదని సమాజాన్ని నిలబెట్టే బాధ్యత కలిగి ఉంటుందన్నారు. విద్యారంగం బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటూ ఉండడంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారాయని అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా జిల్లాలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను గురించి జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ నివేదించారు.గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచిన ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈవోలు నెహ్రూ నాయక్, మనోజ్ కుమార్, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, ఏఎంఒ డాక్టర్ మన్మోహన్, సునీత, సుమా, పలువురు ప్రధానోపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అభ్యాస హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం



**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 05 (జనం సాక్షి)**జాతీయ స్థాయి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక 43 వ డివిజన్ గణేష్ నగర్ లోని అభ్యాస హై స్కూల్ లో గురుపూజోత్సవాన్ని పాఠశాల డైరెక్టర్ మీర్జా అఖిల్ ఉల్లా బెగ్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల అలంకరించి గురుపూజోత్సవాన్ని ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు వెలుగుతున్న కొవ్వత్తి లాంటివారనిసమాజానికి కావలసిన ప్రతి వ్యక్తిని మంచి మనసుతో తీర్చిదిద్దగల గొప్ప మనసున్న మహారాజులు ఉపాధ్యాయులు అని అన్నారు ఒకరోజు యాక్ట్ చేసిన చిన్నారి టీచర్స్ ను వారి వారి అనుభవాలను అనుభూతులను ఎలా పంచుకున్నారు అని వారినుండే ఆనందాన్ని వ్యక్తం చేసేలా చెప్పారు. బోధన అంటే ఒకవృత్తి మాత్రమే కాదుఅదొక ప్రతిజ్ఞ అని అన్నారు.సామర్థ్యం నైతిక విలువలే ఉపాధ్యాయులకు అవసరమైన అవకాశాలు కల్పిస్తాయి అని చెప్పారు. ప్రిన్సిపాల్ మండల శిరీష మాట్లాడుతూ ప్రేమ అంకితభావం ఉన్న ఉపాధ్యాయుడు విద్యార్థిలో దాగి ఉన్న నిగూఢ సామర్థ్యాన్ని అపరిమితమైన స్ఫూర్తిని మేల్కొల్పగలదని విద్యా ప్రయాణం లో విద్యార్థికి మార్గదర్శిగా శ్రేయోభిలాషిగా స్నేహితునిగా సహ ప్రయాణికునిగా ఉపాధ్యాయుడు ఎప్పుడూ అండగా నిలబడి ఉండాలని మనస్ఫూర్తిగా అన్నారు.ఇంచార్జీ కోల రాము మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నుండి దేశ ప్రథమ పౌరుడుగా ఎదగడం ఉపాధ్యాయ వృత్తి కే శుభ సూచకంగా భావించాలనిగౌరవ తల్లిదండ్రులు ఉపాధ్యాయుల మీద స్కూల్ యాజమాన్యం పైన ఎంతో నమ్మకం తో బాధ్యత తో పంపిస్తారు ప్రతీ టీచర్ తమ పిల్లలుగా భావించి విద్యా బోధన చేసి వారి నమ్మకానికి నమ్మకం కలిగించడం ప్రతీ టీచర్ యొక్క బాధ్యత అనిఅన్నారు. కార్యక్రమంలోచీకటి సమ్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గంగాపూర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**రెబ్బెన,సెప్టెంబర్05(జనం సాక్షి):** రెబ్బెన మండలంలోని గంగాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వెంకటేశం చారి, ఉపసర్పంచ్ ఇస్తారి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, రేషన్ డీలర్ శంకర్ లబ్ధిదారులైన మహిళలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు .కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.



# మండల స్థాయి క్రీడా పోటీలు



**నూగూర్ వెంకటాపురం సెప్టెంబర్ 5(జనం సాక్షి ):**- ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో మండల స్థాయి ఎస్ జి ఎఫ్ ఐ క్రీడా పోటీలను సెప్టెంబరు 7,8 తేదీల్లో నిర్వహించనునట్లు మండల విద్యాశాఖ అధికారి జి వి వి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి జివి వి సత్యనారాయణ మాట్లాడుతూ పోటీలలో 14,17 సంవత్సరాల,వయసు చెందిన బాల బాలికలు పాల్గొనవచ్చు అని అన్నారు. ఈ క్రీడలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉన్న విద్యార్థులందరూ పాల్గొనవచ్చు అని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగ చేసుకోవాలని అన్నారు.బాలురకు క్రీడలు కబడ్డీ ఖో, ఖో,వాలీబాల్ అథ్లెటిక్స్, వంటి క్రీడలు నిర్వహిస్తారని తెలిపారు. బాలురకు క్రీడా వేదిక జెడ్ పి హెచ్ ఎస్ వెంకటాపురం గాను, బాలికలకు క్రీడా వేదిక ఆశ్రమ పాఠశాల చిరుతపల్లి - 1 గాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు తమ వెంట ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్,తీసుకొని రావాలని తెలపడం జరిగింది. వివరాలకు సంప్రదించవలసిన వారు బి ప్రవీణ్ పిడి, జడ్పీహెచ్ఎస్ వెంకటాపురం ఫోన్ నెంబరు : 830 9648722.అని పత్రిక ముఖంగా తెలిపారు.

# ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ఇందారపు సిద్దు మాదిగ

**జిల్లా ఇంచార్జి మేడిపల్లి శ్యామ్ మాదిగ, అంబాల చంద్రమొగిలి మాదిగ చేతుల మీదుగా నియామకం**



**మల్హర్, సెప్టెంబర్ 05( జనం సాక్షి)**మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్ ) మల్హర్ మండల నూతన అధ్యక్షుడిగా ఇందారపు సిద్దు మాదిగ ఎన్నికయ్యారు. ఈనెల ఒకటిన జరిగిన కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా ఇంచార్జి మేడిపల్లి శ్యామ్ మాదిగ, అంబాల చంద్రమొగిలి మాదిగ, మండల ఇంచార్జి కేసరపు నరేష్ మాదిగ ఆధ్వర్యంలో ఇందారపు సిద్దు మాదిగను మల్హర్ మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు ఇందారపు సిద్దు మాదిగకు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ బలోపేతానికి, మాదిగల హక్కుల సాధన కోసం సమిష్టిగా పనిచేయాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్ తో రేకుల షెడ్డు దగ్ధం



**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 05 (జనంసాక్షి)** :మండలంలోని రాఘవాపూర్ గ్రామంలో షార్ట్ సర్క్యూట్ తో రేకుల షెడ్డు పూర్తిగా దగ్ధం అయిందని బాధితులు బెజ్జం రాజు- రజిత ఆవేదన వ్యక్తం చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం తో ఇంటిని నిర్మించే స్థలం పక్కన రేకుల షెడ్ ఏర్పాటు చేసుకొని బెజ్జం రాజు-రజిత దినసరి కూలీ చేసుకుంటూ జీవ నం సాగిస్తున్నారు. వారు నివాసముంటున్న రేకులషెడ్డు షార్ట్ సర్క్యూట్ తో దగ్ధం కావడం తో 50 వేల రూపాయల నగదు, పిల్లల సర్టిఫి కెట్లు, ఆధార్ కార్డ్స్, బ్యాంక్ పాస్ బుక్కులు మంటల్లో కాలిపోయాయని తెలిపారు.సుమా రు 2 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుల ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యవసర వస్తువు లు, బట్టలు, పూర్తిగా దగ్ధం అయ్యాయని,ప్రభుత్వం తరపున ఆదుకోవాలని బాధితుల వేడుకుంటున్నారు.

# పెండ్లి అయిన ప్రతి ఆడబిడ్డకు రూ.3వేలు, వ్యక్తి మరణిస్తే రూ.4వేలు

- రెడ్డికుంట తండా సర్పంచ్ యమునా రాకేష్
- మాజీ మంత్రి దయాకర్ రావు సమక్షంలో ఆడబిడ్డకు నగదు పంపిణీ

**పెద్దవంగర, సెప్టెంబర్05 (జనం సాక్షి )** స్థానిక ఎన్నికల ప్రచారంలో రెడ్డికుంట తండా సర్పంచ్ అభ్యర్థి బానోతు యమునా రాకేష్ మ్యానిఫెస్టో విడుదల చేసి ఇచ్చిన మాట ప్రకారం హామీలను గెలుపొందిన వెంటనే అమలుపరుస్తున్నారు. శనివారం మండల కేంద్రంలోని సాయి గార్డెన్స్ లో రెడ్డికుంట తండా జీపీ చెందిన ఆడబిడ్డ అంగోతు విమల - వినయ్ వివాహ వేడుకలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును ఆహ్వానించి దయాకర్ రావు చేతుల మీదుగా రూ.3వేల నగదును వివాహ వేడుకల్లో అందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ.. రెడ్డి కుంట తండా సర్పంచ్ తండావాసులకు ఇచ్చిన మేనిఫెస్టో హామీ ప్రకారం .. హామీలను నెరవేర్చడం అభినందనీయమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో గెలిస్తే 10 గ్యారెంటీలు అమలు చేస్తానని హామీ ఇచ్చి..ఇప్పటికే తండాలో మృతి చెందిన దాదాపు 6 కుటుంబాలకు రూ.4వేలు అందించడం జరిగిందని, జిపిలో అభివృద్ధికి కావలసిన నిధులను అందించి ఆదర్శవంతమైన జిపిగా తీర్చిదిద్దుతున్న



యమునా రాకేష్లను అభినందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలను ఇప్పటికి నెరవేర్చలేదని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ దేవస్థానం చైర్మన్ రామచంద్రయ్య శర్మ, మాజీ జిసిసి చైర్మన్ గాంధీ నాయక్, బీఆర్ఎస్ నేతలు సంజయ్ సుదీర్ ఐలయ్య గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం




నల్లబెల్లి, సెప్టెంబర్ 05(జనంసాక్షి): ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయమని సర్పంచ్ పులి రమేష్ గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని దస్తగిరిపల్లె ప్రాథమిక పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం రమేష్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, పాఠశాల ఉపాధ్యాయులు వేణుకుమార్, కృష్ణకిషోర్, అంగన్వాడీ టీచర్ సుమలత, ఆయా ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉపాధ్యాయులకు సన్మానం



**లక్షెట్టిపేట, సెప్టెంబరు 5జనం సాక్షి** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు లక్షెట్టిపేట్ మండలంలోని మిట్టపెల్లి ప్రభుత్వ పాఠశాలలో శనివారం ప్రధాన ఉపాధ్యాయులను హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు బొడ్డు రవి జోసఫ్ మాట్లాడుతూ.... నేటి బాలలే రేపటి పౌరులు, రేపు రాబోయే తరానికి అత్యంత విలువలు కలిగిన పౌరులను దేశానికి అందించడంలో ప్రధాన పాత్ర కేవలం ఉపాధ్యాయులది మాత్రమేనని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి జీవితములో అత్యంత ప్రదమైనదని ఉపాధ్యాయుల పట్ల పిల్లలు విధేయత కలిగి సాగిపోవాలని తెలిపారు. ఈ సమాజాన్ని ప్రభావితం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని హితవు పలికారు. ప్రపంచంలో ఏ స్థాయిలో నిలబడినా దాని వెనకాల ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున మన గురువులను సత్కరిస్తూ వాళ్ళ ఋణం తీర్చుకునేందుకు ఎల్లవేలల సిద్దంగా ఉండాలని విద్యార్థి లోకానికి సందేశమిచ్చారు. అనంతరం 25 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ ట్రస్ట్ తరఫున అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాతరాసి బానేష్, ప్రధానోపాధ్యాయులు బి గోపీనాథ స్వామి,ఉపాధ్యాయురాలు జి స్వప్న, అంగన్వాడి టీచర్ ఎన్ కనకదుర్గ,పంచాయతీ కార్యదర్శి ఏ రాజమణి,అంబేద్కర్ యువజన సంఘం మండల ఉపాధ్యక్షుడు బైరం లింగన్న, తగరపు సత్తయ్య, శనిగారపు భాస్కర్, వరలక్ష్మి,రాణి ,తదితరులు పాల్గొన్నారు.

# దుబ్యాల గ్రామంలో ఇంటింటికి బ్లీచింగ్ పౌడర్ పంపిణీ

## సర్పంచ్ సంగి అంజలి



**టేకుమట్ల సెప్టెంబర్ 05 జనంసాక్షి** టేకుమట్ల మండలంలోని దుబ్యాల గ్రామంలో ఇంటింటికి బ్లీచింగ్ పౌడర్ వానకాలం దృష్టిలో పెట్టుకొని గ్రామంలో ఉన్న దోమలు ఇంటి పక్కన చెట్లు పిచ్చి మొక్కలు వాటి అన్నిటిని తీసేసుకొని మన ఇంటి పరిసరాల ప్రాంతలను శుభ్రంగా ఉండుటకు సర్పంచి ఉప సర్పంచ్ వార్డు మెంబర్లు అందరూ కలిసి ప్రజలు బాగుండాలని డ్రైనేజీ ప్లాస్టిక్ బాటిల్స్ చెత్త చెదారం దయచేసి డ్రైనేజీ కాలువలో వెయ్యకండి మనకే విష జ్వరాలు కాబట్టి ప్రజలు అర్థం చేసుకోవాలని సర్పంచ్ అంజలి తెలియజేశారు కావున బ్లీచింగ్ పౌడర్ పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బిక్కినేని కిషన్ రావు వార్డ్ మెంబర్లు గుండబోయిన కవిత రవి నిమ్మల బుచ్చమ్మ మోరే స్వరూప రాజయ్య బండారి వినోద్ కుమార్ గస్కంటి సంధ్య సంపత్ చెన్నూరి సునీల్ సంఘీ సంపత్ గ్రామ టేకుమట్ల మండల్ మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు సంగి రవి సిబ్బంది బిలకంటి సంపత్ రావు గస్గంటి కుమారస్వామి నర్సింగు దేవ కర్ణ గ్రామ పెద్దలు రాజయ్య బిల్లకంటి మాధవరావు నిమ్మల మాధవరావు శీను గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించే నిర్ణయాలను విరమించుకోవాలి

## బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య




**బెల్లంపల్లి, సెప్టెంబర్ 5, (జనంసాక్షి)** విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించే అనాలోచిత నిర్ణయాలను వెంటనే విరమించుకోవాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. శనివారం ఆయనఎకాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల వంచక దగా పాలన, 6 గ్యారెంటీలు, 420 హామీల మోసాలపై బిఆర్ఎస్ పోరుబాట కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రంలో ఫీ రీయింబర్స్మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ మోసాలపై నిరసనగా నియోజకవర్గ విద్యార్థులు, నిరుద్యోగులు, యువతతో కలసి నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ ప్రభుత్వం 33 నెలల పాలనలో తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు, నిరుద్యోగులకు, యువతకు బాకీ పడిన ఫీ రీయింబర్స్మెంట్ 12,000 కోట్ల రూపాయలు, 2 లక్షల ఉద్యోగాలు, ప్రతీ నిరుద్యోగికి 1,32,000 రూపాయల నిరుద్యోగ భృతి, 5 లక్షల రూపాయల విద్యా భరోసా కార్డు, రాజీవ్ యువ వికాసం, తదితర హామీలను తక్షణమే అమలుచేయాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తూ తీసుకున్న అనాలోచిత నిర్ణయాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు, నిరుద్యోగులు, యువత తరుపున బిఆర్ఎస్ పార్టీ పక్షాన పోరాటాన్ని ఉద్యమంలా ఉధృతం చేస్తామని రేవంత్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ విద్యార్థులు, నిరుద్యోగులు, యువత, బిఆర్ఎస్వి జిల్లా అధ్యక్షుడు శ్రావణ్, బిఆర్ఎస్వై నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, బిఆర్ఎస్వై బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు అరుణ్, బెల్లంపల్లి మండల అధ్యక్షుడు మహేందర్, బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మండలంలో ఘనంగా గురుపూజోత్సవం



**బయ్యారం సెప్టెంబర్ 5( జనంసాక్షి)** మండలంలోని ప్రభుత్వ,ప్రవేట్ పాఠశాలల్లో గురుపూజోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.భారత మాజీ రాష్ట్రపతి ,గొప్ప విద్యావేత్త, ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతినిపురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సంధర్భంగా మాట్లాడిన వక్తలు విధ్యార్ధుల జీవితాలను తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. తల్లి దండ్రులు జన్మనిస్తే గురువులు విద్యాబుద్ధులు నేర్పి సమాజంలో ఉన్నత స్థానంలో నిలపడానికి కృషి చేస్తానని తెలిపారు.గురువు చూపే మార్గదర్శకత్వం,క్రమశిక్షణ ,విలువలు విధ్యార్ధుల భవిష్యత్తుకు పునాది వంటివని అన్నారు. ఈ సంధర్భంగా విధ్యార్ధులు తమ గురువులకు శాలువాలు కప్పి,పుష్ప గుచ్చాలు అందించి వారి ఆశీస్సులు పొందారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ధనుంజయ అద్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిడిఓ దీపిక, గార్ల బయ్యారం సి ఐ రవీందర్ ముఖ్య అతిథులుగా పాల్గొని సందేశం యిచ్చారు .శ్రీరామవిధ్యాలయంలో కరస్పాండెంట్ విజయన్ ఆధ్వర్యంలో,బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ ఎం లక్ష్మన్ రావు, సి పి ఎస్లో హెచ్ ఎం బాలునాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరగగా,న్యూ ఆక్స్ఫర్డ్ విద్యాలయంలో కరస్పాండెంట్ నిర్మల,వెంకట్రాం పురం ఉన్నత పాఠశాలలో వట్టం లింగరాజు,ఇ ర్సులాపురం ఆశ్రమ పాఠశాలలో హెచ్ ఎం శోభన్ బాబు ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

## వెయ్యి రోజుల ప్రజాపాలన సంబరాలు బైక్ ర్యాలీ

### గంజాయి బ్యాచ్ లను తరిమేస్తా



**మంచిర్యాలప్రతినిధి,సెప్టెంబర్5జనంసాక్షి.** మంచిర్యాల నియోజకవర్గంలో 22 ఏ క్రింద గజం భూమి కూడా ఎవరు తీసుకోరని, మంచిర్యాల నియోజకవర్గంలో గజం భూమి పోయిన తను రాజీనామా చేస్తారని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ సాగర్ రావు పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో వెయ్యి రోజుల ప్రజాపాలన వేడుకల్లో భాగంగా కాంగ్రెస్ కార్యకర్తలతో ఎమ్మెల్యే భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు .ఈ సందర్భంగా ఐబి అంబేద్కర్ విగ్రహం ఆయన మాట్లాడుతూ...ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దు అని 22 ఎ జీవో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాదని నిశ్చింతగా ఉండాలని పేర్కొన్నారు .మెరుగైన ప్రజా పాలనను చూడలేక కొంతమంది అసత్య ప్రచారాలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అంటే నేను అని కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోయినా కార్యకర్తలను కాపాడుకొని పార్టీ బలోపేతం చేశాను అని పేర్కొన్నారు . ఈ మధ్యలో కొంతమంది రాజకీయ బిచ్చగాళ్లు తెర పైకి వస్తున్నారని వారిని ఎవరు నమ్మకూడదని తెలిపారు.గంజాయి బ్యాచ్ ను త్వరలో తరిమేస్తామని పేర్కొన్నారు . కాంగ్రెస్ కార్యకర్తలతో పెట్టుకుంటే ఎవరైనా పారిపోవాల్సిందేనని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో మాజీడిసిసి అధ్యక్షులు కొక్కిరాల సురేఖ మంచిర్యాల మేయర్ జర్నీ మధుకర్ డిప్యూటీ మేయర్ చల్ల రమ్య కార్పొరేటర్లు కార్యకర్తలు పాల్గొన్నారు .

## సర్ ప్రత్యేక క్యాంపును పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 5, (జనంసాక్షి)** బెల్లంపల్లి పట్టణంలోని 6వ వార్డు 55, 56 పోలింగ్ కేంద్రాల్లో శనివారం ఏర్పాటు చేసిన సర్ ప్రత్యేక క్యాంపును అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య పరిశీలించారు. సర్ కార్యక్రమం ద్వారా నోటీసు అందుకున్న వారి వద్ద నుంచి సరైన ధ్రువ పత్రాలు తీసుకొని ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్ ప్రక్రియలో భాగంగా ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను నిబంధనల ప్రకారం స్వీకరించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ సల్ల కృష్ణవేణి, నాయబ్ తహసీల్దార్ హమీద్, గిర్ధవర్, వార్డు ఆఫీసర్, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

## కుంటాలలో వైభవంగా శ్రీకృష్ణాష్టమి పల్లకి సేవలో పాల్గొన్న విద్యుత్ శాఖ అధికారులు



**కుంటాల, సెప్టెంబర్ 5(జనం సాక్షి ):** నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీకృష్ణుడి పల్లకి సేవ భక్తుల కోలాహలం, మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా సాగింది. స్థానిక భక్తులు పల్లకి సేవలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ వేడుకల్లో భైంసా విద్యుత్ శాఖ ఏడిఇ చాట్ల మోహన్ కుమార్, అలాగే విద్యుత్ శాఖ ఏఈ జుట్టు విష్ణు పాల్గొన్నారు. వారు స్వామివారి పల్లకి సేవను దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో స్థానిక గ్రామీణులు, భక్తులు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

## 22ఏపై మహాదీక్షకు నిర్మల్ బీజేపీ నేతల సంఘీభావం



**నిర్మల్ టౌన్, సెప్టెంబరు 5: (జనంసాక్షి)** 22ఏ నిషేధిత భూముల జాబితా నుంచి పేదలు, రైతుల భూములను తొలగించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు చేపట్టిన మహాదీక్షకు నిర్మల్ జిల్లా నుంచి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్‌కు చేరుకుని దీక్షా శిబిరంలో సంఘీభావం తెలిపారు. రాష్ట్ర నాయకులు రావుల రామ్నాథ్, ముత్యం రెడ్డి, సత్యం చంద్రకాంత్, తక్కల రమణారెడ్డి, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు లో పాల్గొన్న జిల్లా ఎస్పీ జానకి షర్మిల



**కుంటాల, సెప్టెంబర్ 5(జనం సాక్షి ):** నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. నిర్వాహకుల ఆహ్వానం మేరకు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల (ఐపిఎస్)ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారి పల్లకీ ఊరేగింపు, ఉయ్యాల సేవ, మరియు ఉట్టి కొట్టే కార్యక్రమాలను తిలకించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు--ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలు మరింత బలోపేతం కావాలని, పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, సీఐ ప్రవీణ్, ఎస్ఐ నరేష్, ప్రజా ప్రతినిధులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల ప్రజాపాలనపై కాంగ్రెస్ బైక్ ర్యాలీ

### 2028లో మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం: కూచాడి శ్రీహరి రావు



**నిర్మల్ బ్యూరో, సెప్టెంబరు 5 (జనంసాక్షి):** వెయ్యి రోజుల ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్మల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ శ్రేణులు, యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ర్యాలీ సాగింది.కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, నిర్మల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కూచాడి శ్రీహరి రావు, ముధోల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నారాయణ పటేల్, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా శ్రీహరి రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, మహిళలు, యువత, పేదల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. వెయ్యి రోజుల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. 2028 ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని శ్రీహరి రావు ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో ద్విచక్రవాహనాలతో ర్యాలీలో పాల్గొనడంతో నిర్మల్ పట్టణంలో సందడి నెలకొంది.

## స్మార్ట్ రేషన్ కార్డులతో పారదర్శకత



**కుభీర్, సెప్టెంబర్ 05, (జనంసాక్షి):** కుబీర్ మండలంలోని పార్డి (కే) గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ బందెల గంగామణి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించడంతో పాటు అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు స్మార్ట్ కార్డులు దోహదపడతాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, రేషన్ డీలర్ కలీమోద్దీన్, ఉప సర్పంచ్ నాయుడు పోశెట్టి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మార్లవాయిని సందర్శించిన హైమన్‌డార్ఫ్ ఆత్మీయులు



**జైనూర్, సెప్టెంబర్ 5: (జనం సాక్షి)** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయి గ్రామాన్ని డా. రామ్ కిషన్, సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ పి. నిరూప్, ఆదివాసీ చెంచు మిత్రులు గురువయ్య (చెంచులోకం), రవి (చెంచు టీం ఫార్మర్ -- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) సభ్యులు సందర్శించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు, సర్పంచ్ కనక ప్రతిభ వారికి స్వాగతం పలికారు. అనంతరం ఆదివాసీ ఆత్మబంధువులు ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్--బెట్టీ ఎలిజబెత్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హైమన్‌డార్ఫ్ మ్యూజియాన్ని సందర్శించి ఆయన చరిత్ర, ఆదివాసీ సమాజానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.అనంతరం శృతివనాన్ని సందర్శించి సమాధులకు నివాళులు అర్పించారు. మార్లవాయి గతంతో పోలిస్తే నేడు అభివృద్ధి చెందడం ఆనందంగా ఉందని, హైమన్‌డార్ఫ్ సేవలను ఆదివాసీ సమాజం తరతరాలకు గుర్తుచేసుకోవడం అభినందనీయమని సందర్శకులు పేర్కొన్నారు.ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను పరిరక్షించడంతో పాటు చిరుధాన్యాలు, సంప్రదాయ పంటలను కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆత్రం రాజేశ్వర్, పటేల్ ఆత్రం భగవంతురావు, మాజీ సర్పంచ్ దేవరీ కనకకొద్దు,వార్డ్ సభ్యులు కొడప పుల్ల బాయి,సోయాం రాజు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యాయులు అశోక్, కనక వెంకటేశ్వరరావు,సార్ మేడి గేడం గణపత్ గ్రామస్తులు కనక భుజంగ్ రావు, తుకారాం, రమేష్,జంగు, శ్రీను జూగాది రావ్,సోనేరావ్, జ్యోతిరామ్, లచ్చు తదితరులు పాల్గొన్నారు..

## లయన్స్ క్లబ్ ఆఫ్ గోలేటి స్పోర్ట్స్ ఆధ్వర్యంలో సన్మానం




**రెబ్బెన,సెప్టెంబర్05(జనం సాక్షి):** రెబ్బెన మండలంలోని ఎస్ వి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో లైన్స్ క్లబ్ ఆఫ్ గోలేటి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులు ఎస్సార్ కి ప్రభాకర్ ను ఘనంగా సన్మానించారు అనంతరం ముఖ్యఅతిథిగా వచ్చిన గ్రామ సర్పంచ్ దుర్గం భరద్వాజ్ మాట్లాడుతూ నిస్వార్థంతో ఉపాధ్యాయుడిగా పని చేసి పదవి విరమణ పొందిన ఎస్ఆర్కె ప్రభాకర్కు శుభాకాంక్షలు తెలిపారు అనంతరం ఆయన ఆధ్వర్యంలో ఎంతోమంది విద్యార్థులను డాక్టర్లు యాక్టర్లుగా ఇంజనులుగా పోలీసు అధికారులుగా తయారు చేసిన ఘనత ప్రభాకర్ దక్కిందని అన్నారు మన రాష్ట్రంలోనే కాకుండా దేశంలో ప్రపంచంలో అతని విద్యార్థులు సమాజంలో సేవ సేవ చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గోలేటి అధ్యక్షులు దీకొండ సంజీవ్ కుమార్ ఉపాధ్యాయులు శ్రీనివాస్ మంజు సురేష్ నీలిమ మల్లేశ్వరి విజయ కుమారి అరుణ రూప మేఘన మహేందర్ లతోపాటు తదితరులు ఉన్నారు.

# పదేళ్లు అధికారంలో ఉండి రైతులకు ఏం చేశారు?

### బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ సూటి ప్రశ్న



**గోవిందరావుపేట సెప్టెంబర్05( జనం సాక్షి) :** రైతుల సాగునీటి సమస్యపై బీఆర్ఎస్ నాయకులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, బడే నాగజ్యోతి చేస్తున్న రాజకీయ విమర్శలపై గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ తీవ్రంగా స్పందించారు.రైతులపై మీకు నిజంగా ప్రేమ ఉంటే పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు గుర్తు రాలేదు? గోవిందరావుపేట మండల రైతుల సాగునీటి సమస్య మీ పదేళ్ల పాలనలో ఎందుకు పరిష్కారం కాలేదు? లక్నవరం జలాశయానికి దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ఎందుకు తీసుకురాలేకపోయారు?అని ఆయన సూటిగా ప్రశ్నించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు పదేళ్ల అధికారంలో ఉందని, ఆ సమయంలో గోవిందరావుపేట మండల రైతుల సాగునీటి సమస్యను పరిష్కరించే అవకాశం, అధికార యంత్రాంగం, వనరులు వారి చేతుల్లోనే ఉన్నాయని గుర్తు చేశారు. అయినప్పటికీ రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుండా ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత రైతులపై మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందన్నారు.అధికారంలో ఉన్న పదేళ్లలో రైతుల కోసం ఏం చేశారో ముందుగా ప్రజలకు చెప్పండి.రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న సమయంలో వారి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేయాల్సింది పోయి, గోవిందరావుపేట మండల కేంద్రానికి వచ్చి డీజేలు పెట్టుకుని నృత్యాలు చేస్తూ రాజకీయ హడావుడి చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇది రైతుల కోసం చేసిన ధర్నానా? లేక రాజకీయ కార్యక్రమమా? రైతులు నీటి కోసం ఎదురుచూస్తుంటే డీజేలు పెట్టుకుని నృత్యాలు చేయడం ఏ రకమైన రైతు ఉద్యమం? రైతుల బాధ మీకు కనిపించడం లేదా?అని బీఆర్ఎస్ నాయకులను నిలదీశారు.మరోవైపు రైతుల సాగునీటి సమస్యపై మంత్రి సీతక్క ఇప్పటికే స్పందించి లక్నవరం జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. అధికారులు కూడా నీటి విడుదలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు.రైతులకు నీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అధికారులు నీటి విడుదలకు సిద్ధమవుతున్న సమయంలో కూడా కావాలనే గోవిందరావుపేటకు వచ్చి రాజకీయ రాద్ధాంతం చేయడం ఎందుకు? రైతుల సమస్య పరిష్కారం కావడమే మీకు కావాలా, లేక ఆ సమస్య పేరుతో రాజకీయ లబ్ధి పొందడమే మీ లక్ష్యమా?అని వెంకటకృష్ణ ప్రశ్నించారు. గోవిందరావుపేట మండల రైతులకు సాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు.మీ పదేళ్ల పాలనలో గోవిందరావుపేట మండల రైతులకు ఏం చేశారు? లక్నవరం జలాశయానికి దేవాదుల నీటిని ఎందుకు తీసుకురాలేకపోయారు? రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం ఎందుకు చూపించలేకపోయారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పిన తర్వాతే ఇప్పుడు రైతుల గురించి మాట్లాడండి. అని పాలడుగు వెంకటకృష్ణ అన్నారు.రైతుల కష్టాలను రాజకీయ ప్రచారానికి వేదికగా మార్చుకోవడం మానుకోవాలని, రైతులకు మేలు చేసే విషయంలో ప్రభుత్వానికి సహకరించాలని ఆయన బీఆర్ఎస్ నాయకులకు సూచించారు.గోవిందరావుపేట మండల రైతుల ప్రయోజనాలే కాంగ్రెస్ ప్రభుత్వానికి, మంత్రి సీతక్కకు ప్రధాన లక్ష్యమని, రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పాలడుగు వెంకటకృష్ణ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కార్మిక శాఖా అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి,మద్దాలి నాగమణి,జెట్టి సోమయ్య,కనతల నాగేందర్ రావు,రసపుత్ సీతారామ్ నాయక్,చింత క్రాంతి,భుక్య రాజు,భైరిఅభిలాష్, ఉమాదేవి,రవి, చంద్రశేఖర్, సుధాకర్,కృష్ణ, వెంకటేశ్వర్ రావు, లావుద్యా జోగా, లక్ష్మణ్, విజయ,వజ్రమ్మ తదితర నాయకులు పాల్గొన్నారు.

# హలో మాల చలో హనుమకొండ కరపత్రం ఆవిష్కరణ



**ములుగు,సెప్టెంబర్05(జనం సాక్షి):-** మాల మాల ఉపకులాలకు రిజర్వేషన్ల ద్వారా జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వానికి తెలియజేయడం కోసం హనుమకొండలోని ఏకశిలా పార్కు వద్ద ఏడవ తారీఖు ఉదయం 10 నుండి నిరాహార దీక్ష చేపట్టడం జరుగుతుంది భారతదేశంలో ప్రతి కులం ఒక ప్రత్యేకమైన కులవృత్తిని కలిగి ఉండి ఉత్పత్తి ద్వారా ఈ దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయువు పోశాయి కానీ మాల కులం మాత్రం ఒకే కులవృత్తిని అట్టి పెట్టుకోకుండా కాలానుగుణంగా మారుతున్న సమాజ అవసరాలను తీర్చడానికి అనేక రకాల వృత్తులను చేపట్టి ఈ సమాజ నిర్మాణాన్ని తమ త్యాగాల పునాదుల మీద నిర్మించింది అడవులను నరికి నేలను చదును చేసి నల్లని మట్టి నుండి తెల్లని బువ్వ తీసి సమాజానికి అన్నం పెట్టిన అన్నదాతగా చెరువులను కాపాడి సాగునీరు అందించిన మాలనీరటీలుగా బట్టలు నేసిన మాలనేతకారునిగా చనిపోయిన శవాలను ఖననం చేసిన మాల బెగరులుగా ఆయుర్వేద వైద్యానికి ప్రాణం పోసి ప్రజలను రోగాల నుండి కాపాడిన మాల పంబాలలుగా గస్తీ కాసి గ్రామాలను రక్షించిన శంకరులుగా ఈ దేశ సామాజిక ఆర్థిక నిర్మాణంలో మహోన్నత పాత్ర పోషించారు సమాజం కోసం సర్వస్వం ద్వారా పోసిన మాలల్ని సవర్ణ సమాజం అంటరానివారిగా చిత్రీకరించి ఊరికి దూరంగా వెలివేసింది కూడు గూడు బట్ట విద్య వంటి మనిషి కనీస అవసరాలు కూడా నోచుకోకుండా అతి క్రూరంగా అణచివేసింది భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పోరాట ఫలితంగా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ద్వారా విద్యా ఉద్యోగ రంగాల్లో వచ్చిన రిజర్వేషన్ల వల్ల తెలంగాణ రాష్ట్రంలోని మాలలు ఇప్పుడిప్పుడే అభివృద్ధి బాటలో అడుగులు వేస్తున్నారు అంతలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్సీ రిజర్వేషన్లను అశాస్త్రీయంగా వర్గీకరించి మాలలను మరియు ఇతర 26 ఉపకులాలను కలిపి గ్రూప్ త్రీ కింద చేర్చి ఫైవ్ పర్సెంట్ రిజర్వేషన్లను ఇచ్చే రోస్టర్ పాయింట్లలో మొదట 22వ స్థానం కేటాయించారు దీంతో తెలంగాణలోని యావత్తు మాల విద్యార్థులు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రావడం లేదు ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రకటించిన కొన్ని ఉద్యోగ నోటిఫికేషన్లలో మాలలకు అసలు ఉద్యోగాలే రాలేదు వచ్చిన వాటిలో 5% రావడం లేదు వర్గీకరణ చేసినప్పటి నుండి ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను ఒక్కసారి పరిశీలించినట్లయితే ఇప్పటివరకు ఏ ఒక్క ఉద్యోగం కూడా మాల మాల ఉపకులాలకు అందలేదు కావున మా యొక్క బాధను తెలియజెప్పడానికి ఏడవ తారీఖు ఏకశిలా పార్కు వద్ద మహా నిరసన దీక్ష చేపట్టి ప్రభుత్వానికి మాపై దయ చూపాలని తెలియజేయడానికి ఈ కార్యక్రమం చేస్తున్నాము కావున ములుగు జిల్లాలోని మాల మాల ఉప కులాలకు సంబంధించిన వారు ఏడవ తారీకు హనుమకొండలోని ఏకశిలా పార్కు వద్దకు వచ్చి ఈ నిరసన దీక్ష కార్యక్రమంలో పాల్గొనాలని ములుగు జిల్లా మాల మహానాడు ములుగు నియోజకవర్గ ఇన్చార్జ్ జనగాం రవి పిలుపునిచ్చారు.ఈ కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న వారు ములుగు జిల్లా మాల మహానాడు ఇంచార్జ్ జనగాం రవి మరియు నారమళ్ళ కిరణ్ బండారి సందీప్ బండారి రజనీకర్ నారమల్ల అఖిల్ కుమార్ నారమళ్ళ నిఖిల్ కుమార్ బండారి రజనీకర్ నారమళ్ళ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య



**చిట్యాల, సెప్టెంబర్05( జనం సాక్షి ):** మండల కేంద్రంలోని పాసిగడ్డ తండాకు చెందిన భూక్య తిరుపతి అలియాస్ సురేష్ (22) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ పోచంపల్లి సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాసిగడ్డ తండాకు చెందిన భూక్య తిరుపతి తల్లిదండ్రులు సుమారు ఎనిమిది సంవత్సరాల క్రితమే మృతి చెందారు. దీంతో తిరుపతి తన చదువును ఆపేసి, కూలీ పనులు చేసుకుంటూ తన ఇద్దరు తమ్ముళ్లు, ఒక చెల్లెలి బాగోగులు చూసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లిదండ్రులు లేకపోవడం, తోబుట్టువుల పోషణ భారం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన తిరుపతి జీవితంపై విరక్తి చెంది ఈ నెల 04వ తేదీ సాయంత్రం 7:00 గంటల సమయంలో తన ఇంట్లోని ఐరన్ పైపుకు నైలాన్ తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కిందికి దించేలోపే అతను మృతి చెందాడు.ఈ ఘటనపై మృతుని కుటుంబసభ్యుడు భూక్య రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు, మృతదేహాన్ని పంచనామా నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ పోచంపల్లి సతీష్ పేర్కొన్నారు.

# విద్యార్థి, యువతకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### బిఆర్ఎస్వి ములుగు జిల్లా ఇంచార్జ్ కొనుకటి ప్రశాంత్



**ములుగు ప్రతినిధి,సెప్టెంబర్ 05(జనంసాక్షి).** బిఆర్ఎస్వి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం(బిఆర్ఎస్వి) జిల్లా ఇంచార్జ్ కొనుకటి ప్రశాంత్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్వి ములుగు జిల్లా ఇంచార్జ్ కొనుకటి ప్రశాంత్ మాట్లాడుతూ విద్యార్థి, యువతరానికి ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అదేవిధంగా పెండింగ్ లో ఉన్న 14వేల కోట్ల స్కాలర్ షిప్స్, ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు నష్టం చేసే జీవో 97 వెంటనే రద్దు చేయాలని,మెగా డిఎస్సి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు, జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోతే భవిష్యత్తు లో భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్వి ములుగు జిల్లా నాయకులు దుర్గం రాజు కుమార్, ఎండి సోయల్, ఎల్లబోయిన నాగరాజు, తేజ రెడ్డి, శివ, కిషోర్, సంతోష్, నరేందర్, రాజబాబు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

# బుగులు వెంకటేశ్వర స్వామి కళ్యాణం

### హాజరైన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు



స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 05 (జనం సాక్షి) : చిల్పూర్ మండల కేంద్రంలోని చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం ఆలయ ఈవోలి లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో స్వామి వారి వార కళ్యాణము వేదమంత్రోచరణలతో అర్చకులు వైభవంగా నిర్వహించారు.శ్రావణమాసము ఆఖరి నాలు గవ శనివారం కావడంతో కళ్యాణం లో వివిధ గ్రామాల నుండి పట్టణాల నుండి తండోపతం దాలుగా తరలివచ్చి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం స్వామి వారిని దర్శిం చుకుని తీర్థ ప్రసాదములు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ధర్మకర్త మండలి సభ్యులు గోలీ రాజశేఖర్ ,ఆలయ ఈవో లక్ష్మీ ప్రసన్న, జూని యర్ అసిస్టెంట్ సిహెచ్ రాజేందర్ రెడ్డి, ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, అర్చకులు సౌమిత్రి శ్రీరంగాచార్యులు, కృష్ణమాచార్యులు,ఆదిత్య అన్నప్రసాద దాతలు ఎస్ కార్తీక్ -తేజశ్రీ, తాటి రెడ్డి శశికుమార్ - శైలజ, పుష్పగిరి నిఖిల్ చక్రవర్తి -హరిణి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మండలంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**వెంకటాపూర్(రామప్ప) సెప్టెంబర్05(జనం సాక్షి):-** భారత మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం వెంకటాపూర్ మండలంలో ఘనంగా నిర్వహించారు. వెంకటాపూర్, లక్ష్మీదేవిపేట, పాలంపేటతో మండలంలోని అన్ని ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించుకోవడం జరిగింది. ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానాలతో సత్కరించుకోవడం జరిగింది. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత స్థానంలో ఎదగాలని, కష్టపడి ఎదగాలని ఉన్నత స్థానంలో ఉండాలని ప్రతి ఉపాధ్యాయుడు కోరుకుంటాము అని అన్నారు.అలాగే నల్లగుంట గ్రామ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను హెడ్మాస్టర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్లగుంట గ్రామ సర్పంచ్ భూక్య శ్రీదేవి శంకర్ నాయక్,ములుగు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొమురవెల్లి రమేష్ మరియు పులి మధుసూదన్ రెడ్డి,8వ వార్డ్ మెంబర్ ఇటీకాల సుమలత, రామగిరి శ్రీనివాస్, కాంతాల నరసింహారెడ్డి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబర్ 05(జనం సాక్షి):-** మండల కేంద్రంలోని జడ్పీహెచ్ హై స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.పాఠశాల ప్రిన్సిపాల్ రాధిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సీతక్క తనయులు సూర్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం సూర్య మాట్లాడుతూ ప్రతి గురువును దేవునితో సమానంగా చూడాలి. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర ఎంతో గొప్పది. తల్లిదండ్రులు జన్మనిస్తే, గురువులు జీవితాన్ని ఇస్తారు అని అన్నారు.గురువుల సేవలను కొనియాడిన ఆయన, విద్యార్థులు గురువులను గౌరవిస్తూ, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ ఎస్ఐ చల్లా రాజు, ఎన్ఎస్యుఐ అధ్యక్షుడు కోటి, సీనియర్ నాయకులు శ్రీను, గ్రామకమిటీ అధ్యక్షులు జాకీర్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు, యువ నాయకులు పాల్గొన్నారు.

## బాలిక సదనం నుంచి తమిళనాడుకు దత్తత

### బాలికను అభినందించిన కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్5 (జనం సాక్షి) :** ప్రభుత్వ బాలిక సదనంలో రక్షణ సంరక్షణ విద్యా బుద్ధులు నేర్చుకొని తన ఇష్టాలకు అనుగుణంగా దత్తతకు ఒప్పుకొని కేంద్ర దత్తత ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం రోజున తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా ఉదయాల్పురంకు చెందిన దంపతులకు హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో చట్టబద్ధమైన దత్తత అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ చట్టబద్ధమైన దత్తత శ్రేయస్కరమని అన్నారు.కాగా దత్తత ఇవ్వబడిన బాలికతో కలెక్టర్ మాట్లాడి హర్షం వ్యక్తం చేసారు.కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ, బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సిహెచ్ అవంతి, ప్రభుత్వ బాలికల సదనం సూపరింటెండెంట్ ఎం కల్యాణి, ఈవో ఆశాదేవి, ఇంచార్జి డిసిపివో ఎస్ ప్రవీణ్ కుమార్, సోషల్ వర్కర్ సంగి చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెసును వీడుతున్న కార్యకర్తలు

- గాంధీనగర్ గ్రామపంచాయితీలో కాంగ్రెస్‌కు షాక్.
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలు సమాధానాలు చెప్పలేక పార్టీ విడుతున్న కార్యకర్తలు ?

**గాంధీనగర్ సెప్టెంబర్ 5 జనం సాక్షి :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపిస్తూ గాంధీనగర్ గ్రామపంచాయతీకి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.గాంధీనగర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు చెల్పూరి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి సమక్షంలో 16 మంది కార్యకర్తలకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.చేరికల్లో గాంధీనగర్ గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ వార్డు నంబర్‌గా ఉన్న లకావత్ ఈర్య, గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉండటం ప్రత్యేక రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన కూరాకుల మల్లిక, కూరాకుల సారయ్య, చెల్పూరి శ్రీను, బానోతు దాసు, కుంతావత్ రుచిత్, బానోత్ కిషోర్, బోళ్ళ శ్రీను, మారబోయిన రుషి, గూగులోత్ రమేష్, గూగులోత్ లక్ష్మి, బెల్లి మల్లయ్య, తేజావత్ వెంకటేశ్వర్లు, భూక్యా వీరస్వామి, బాజావత్ రుషి, సపావత్ నగేష్ బీఆర్ఎస్‌లో చేరారు.



**30 ఏళ్ల కాంగ్రెస్ అనుబంధానికి ముగింపు ఎందుకు?**

గత మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీతో అనుబంధం కొనసాగించిన ఒక మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరడం వెనుక కారణాలను కాంగ్రెస్ నాయకత్వం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు.జిల్లా అధ్యక్షులు కాకుల మర్రి లక్ష్మణ్ బాబుమాట్లాడుతూ కాంగ్రెస్ మోసాలపై ప్రజలకు లెక్క చెప్పాల్సిందే అన్నారు.అదేవిధనగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, అనేక హామీల పేరుతో తెలంగాణ ప్రజలను ఆకర్షించి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు.రైతులు, మహిళలు, యువత, పేదలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఇలా అన్ని వర్గాలకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు ఆ హామీల అమలుపై ప్రజలకు పూర్తి స్థాయి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఏం హామీ ఇచ్చారు?ఏం అమలు చేశారు?ఇంకా ఏం చేయలేద? ఎప్పుడు అమలు చేస్తారు? పై నాలుగు ప్రశ్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని లక్ష్మణ్ బాబు డిమాండ్ చేశారు.ములుగు నియోజకవర్గం ఇంచార్జ్ బడే నాగజ్యోతి మాట్లాడుతూ మహిళల ఓట్లతో అధికారంలోకి వచ్చి మహిళలనే మర్చిపోయారాని అన్నారు.కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చిన హామీలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.మహిళలకు ఇస్తామని చెప్పిన □2,500, గ్యాస్ సబ్సిడీ, పెన్షన్లు, షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి, ఇందిరమ్మ ఇళ్ల వంటి హామీల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన లెక్కలు ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు.

**వెయ్యి రోజుల సంబరాలు కాదు వెయ్యి రోజుల లెక్కలు చెప్పాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను ఘనంగా చెప్పుకోవడానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో, ముందుగా ఈ వెయ్యి రోజుల్లో ప్రజలకు ఏం చేసిందో లెక్క చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ఎన్నికల హామీల్లో ఎన్ని అమలు చేశారో, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో, ఎప్పుడు అమలు చేస్తారో ప్రభుత్వం ప్రజలకు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**గాంధీనగర్ చేరికలు కాంగ్రెస్‌కు హెచ్చరిక**

గాంధీనగర్‌లో 16 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరడం కేవలం ఒక రాజకీయ కార్యక్రమం కాదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.ప్రజల మధ్య పనిచేసే కార్యకర్తలు ప్రభుత్వ పనితీరును అత్యంత దగ్గరగా గమనిస్తారని, అలాంటి కార్యకర్తలు పార్టీని వీడుతున్నారంటే దాని వెనుక ఉన్న కారణాలను కాంగ్రెస్ నాయకత్వం పరిశీలించుకోవాలని సూచించారు.

**ఇక హామీలతో కాదు... లెక్కలతో మాట్లాడాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇక కొత్త హామీలు ఇవ్వడం కంటే గతంలో ఇచ్చిన హామీలపై లెక్కలు చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.గాంధీనగర్‌లో ప్రారంభమైన ఈ రాజకీయ పరిణామాలు రానున్న రోజుల్లో మరింత విస్తరించే అవకాశం ఉందని, ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో గోవింద్ నాయక్, తాటి కృష్ణ, భూక్యా జంపన్న, బొల్లం ప్రసాద్, శ్రీనివాసురెడ్డి, మల్లారెడ్డి,లకావత్ చందులల్, వెలిశాల స్వరూప తాటికొండ శ్రీనివాస చారి,గజ్జి ఏలెందర్, కత్తుల సారయ్య, ఎక్కుల ధనుంజయ్య,ఒక్క సరిత కుమార్, పంది బోయిన సమ్మయ్య, మడికొండ రమేష్, చల్ల పండురంగా,రుద్రారపు శేఖర్, కొయ్యడ శ్రీకాంత్, ఇస్లావత్ శేఖర్ మంచి కలపూడి అరుణ్ గోగులోతు రమేష్ కుంతావత్ శ్రీను కాటాపూర్ నరేష్, కోకిల నరసయ్య నదునూరి భానుచందర్, తొడుస్సు వెంకన్న మేడుదుల వెంకన్న గుండె సోమయ్య బుర్రి వీరయ్య బర్ల లింగారెడ్డి జల్లెల మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గులాబీ రంగు పురుగు ఉనికిని ప్రారంభ దశలోనే గుర్తించాలి

### రైతు విజ్ఞాన కేంద్రం జనగామ కోఆర్డినేటర్ డాక్టర్ వి రమ్య




**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 04(జనం సాక్షి) :** ప్రత్తిలో గులాబీ పురుగు కట్టడికి గులాబీ రంగు పురుగు ఉనికిని ప్రారంభదశలోనే రైతు లుగుర్తించాలని రైతు విజ్ఞానకేంద్రం జనగామ కో ఆర్డినేటర్ డాక్టర్ వి రమ్య తెలిపారు. చిల్పూర్ మండలం చిన్నపెండ్యాల గ్రామంలో ప్రత్తి పంటలో గులాబీ రంగు పురుగు రసం పీల్చే పురుగుల సమగ్ర యాజమాన్యంపై రైతులకు అవగాహన కార్యక్రమం, క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ప్రస్తుతం ప్రత్తి పంట పూత, కాయ ఏర్పడటం మరియు కాయల అభివృద్ధి దశలో ఉన్నందున గులాబీ రంగు పురుగు ఉనికిని ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో నివారణ చర్యలు చేపట్టడం అత్యంత ముఖ్యమని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం జనగామ కోఆర్డినేటర్ డాక్టర్ వి రమ్య తెలిపారు. చిల్పూర్ మండల వ్యవ సాయ అధికారి నర్సింగ రావు మాట్లాడుతూ గులాబీరంగు పురుగు ప్రధానంగా కాయలలో కిప్రవేశించి లోపలవిత్తనాలను దెబ్బతీయడం వల్ల నష్టం బయటకు స్పష్టంగా కనిపించకపో వచ్చని, అందువల్ల పంటను క్రమం తప్పకుండా పరిశీలించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కిరణ్ రెడ్డి , వరంగల్ వ్యవసాయ కళాశాల గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం (రావెప్) విద్యార్థినులు, రైతులు రమేష్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



బెల్లంపల్లి, సెప్టెంబర్ 5, (జనంసాక్షి) దేశం గర్వించే గొప్ప తత్వవేత్త, ప్రఖ్యాత విద్యావేత్త, రెండవ రాష్ట్రపతిగా ఖ్యాతిగాంచిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శనివారం బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో స్వయం పాలన నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల ప్రధాన భూమికను నిర్వహించారు. తరగతులను బోధించడం, విద్యా పరిపాలన బాధ్యతలు నిర్వహించడం ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థుల్లో నాయకత్వ నైపుణ్యాలు, నిర్ణయ సామర్థ్యం, బాధ్యతాయుత మనస్తత్వం పెంపొందించడానికి ఒక గొప్ప వేదికగా నిలుస్తుంది. అనంతరం ఉపాధ్యాయుల సన్మాన చేశారు. విద్యార్థులు తమకు జ్ఞానాన్ని అందించే గురువులకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి, కృతజ్ఞతతో సన్మానించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల జీవిత నిర్మాణంలో చేసే త్యాగాలను గుర్తు చేసుకుంటూ, వారిపై గౌరవాన్ని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏ అంజయ్య, సీనియర్ అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సోమయ్య, గురుపాదం కరుణాకర్, చంద్రయ్య, లక్ష్మణ్, తిరుమల దేవి, విమల్ కుమార్, సత్తయ్య, రాజేష్, డాక్టర్ ఉపేందర్, ప్రవళిక, లక్ష్మణ్, నవీన్, నరేష్, బేబీ శ్రావణి, హబీబ్, అర్జున్, సురేష్, స్వరూప, శారద, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## సీఐ బాబు లాల్‌ను కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు



ఆత్మకూర్, సెప్టెంబర్ 5 (జనం సాక్షి): ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిఐ బాబులాల్ ని కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వారిలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్, మండల అధ్యక్షులు తనుగుల సందీప్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుండేబోయిన శ్యామ్,మాదాసి రాజు,యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి పిట్టల రాజకుమార్, యూత్ కాంగ్రెస్ మాజీ మండల ఉపాధ్యక్షులు కాడబోయిన రాజ్ కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ కరీం,అర్షం మురళి, దూరిశెట్టి శ్రవణ్, మానగాని గోపాల్,మోరే శివకుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుంది

### ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు రామడుగు లక్ష్మణ్

మంచిర్యాల ప్రతినిధి , సెప్టెంబర్ 5 జనం సాక్షి కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ప్రభుత్వ రంగాన్ని బలహీనపరుస్తోందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు రామడుగు లక్ష్మణ్ పేర్కొన్నారు శనివారం నాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐ.బి చౌరస్తాలో సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభల లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంపదను సృష్టించే కార్మికులు, రైతుల ప్రయోజనాలను పక్కనపెట్టి కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తోందని అన్నారు. జిడిపి పెరుగుతోందని కేంద్ర ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, ఆ పెరుగుదల సామాన్య ప్రజల జీవితాల్లో ఎందుకు కనిపించడం లేదని వారు ప్రశ్నించారు. జిడిపి పెరుగుతుంటే దేశంలో నిరుద్యోగ సమస్య ఎందుకు తీవ్రంగా ఉంది? కార్మికుల వేతనాలు, ఉద్యోగ భద్రత ఎందుకు మెరుగుపడటం లేదు? రైతుల ఆదాయం, జీవన ప్రమాణాలు ఎందుకు పెరగడం లేదని ప్రశ్నించారు. జిడిపి గణాంకాల పెరుగుదల మాత్రమే దేశ అభివృద్ధికి కొలమానం కాదని, ప్రజల కొనుగోలు శక్తి, ఉపాధి అవకాశాలు, కార్మికుల వేతనాలు,




రైతుల ఆదాయం, సామాజిక భద్రత మెరుగుపడినప్పుడే నిజమైన ఆర్థిక అభివృద్ధి జరిగినట్లుగా భావించాలని అన్నారు. కార్మిక హక్కులను కాపాడేందుకు, ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించేందుకు, ఉపాధి భద్రత కల్పించేందుకు, కార్మికులకు మెరుగైన వేతనాలు అందించేందుకు ఏఐటీయుసి నిరంతరం పోరాడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఖలీందర్ అలీఖాన్, జోగుల మల్లయ్య, మిట్టపల్లి పౌలు, లింగం రవి, కొట్టే కిషన్ రావు,వనం సత్యనారాయణ, మిర్యాల రాజేశ్వర్ రావు,చాదా మహెందర్ రెడ్డి, కాదండి సాంబయ్య, ఎగుడ మొండి, పానుగంటి సత్యనారాయణ,మండ యాదగిరి,బియ్యాల రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

## ప్లంబర్ల హక్కులు, గౌరవం కోసం ఐక్యంగా కృషి



నిర్మల్ టౌన్, సెప్టెంబరు5: (జనంసాక్షి). న్యూ నిర్మల్ యంగ్ స్టార్స్ ప్లంబర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ ముదాసీర్, ఉపాధ్యక్షుడిగా షేక్ అఫ్రోజ్, కార్యదర్శిగా సయ్యద్ రఫీక్, కోశాధికారిగా షేక్ మాజీద్, ఉపకోశాధికారిగా షేక్ ముజాహిద్, రైటర్‌గా షేక్ ఫైజల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ముదాసీర్ మాట్లాడుతూ ప్లంబర్ల హక్కులు, గౌరవం, భవిష్యత్తు కోసం సంఘం ఐక్యంగా పనిచేస్తుందని తెలిపారు. ప్లంబర్ కేవలం కూలీ కాదని, నైపుణ్యం కలిగిన వృత్తి నిపుణుడని పేర్కొన్నారు. పనికి తగిన న్యాయమైన రేట్లు, సకాలంలో చెల్లింపులు, భద్రతా ప్రమాణాలు కల్పించాలని కోరారు. కార్యక్రమానికి హాజరైన లేబర్ శాఖ అధికారి ముత్యంరెడ్డి కార్మికులు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు విధుల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం ఆయనను అసోసియేషన్ సభ్యులు శాలువాతో సన్మానించారు. సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి




రామకృష్ణాపూర్,సెప్టెంబరు05(జనంసాక్షి): తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ-జేఏసీ మండల అధ్యక్షుడు మేడి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ సతీష్ శర్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన దాదాపు రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బకాయిల కారణంగా ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువులు కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కాలేజీ యాజమాన్యాల ఒత్తిడితో విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక, పైచదువులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకుడు నందిపాటి రాజు, ఎం.వెంకటేష్, సీహెచ్.కుమార్, పొట్ట భూమయ్య పాల్గొన్నారు.

## తాండూరులో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం



తాండూర్, సెప్టెంబర్ 05(జనం సాక్షి) మంచిర్యాల జిల్లా : తాండూరు మండలంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం గురువులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ వేడుకలను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా విద్యావిభాగంలో విశేష సేవలు అందిస్తున్న తాండూరు మండల విద్యాధికారి డి. శ్రీనివాస్ తో పాటు ఉపాధ్యాయులు జె. భాగ్య, ఎం. స్వప్న, వై. పద్మజ, ఎస్. మౌనిక, లింగయ్య, అశోక్, ఎం. రమేష్, సిహెచ్. రామన్నలను లయన్స్ క్లబ్ ప్రతినిధులు శాలువాలు కప్పి, ఘనంగా సన్మానించారు. గురువులే భవిష్యత్తుకు బంగారు బాటలు: క్లబ్ అధ్యక్షులు ఠాకూర్ ఉమ్రావ్ సింగ్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఠాకూర్ ఉమ్రావ్ సింగ్ మాట్లాడుతూ.. సమాజంలో అజ్ఞానమనే చీకటిని పారద్రోలి, జ్ఞానమనే వెలుగును ప్రసాదించేది గురువు మాత్రమేనని కొనియాడారు. లోకంలో ఒక డాక్టర్, ఇంజనీర్, సైంటిస్ట్ లేదా ఒక మంచి పౌరుడు తయారయ్యాడంటే దానికి మూలకారణం ఉపాధ్యాయుడేనని స్పష్టం చేశారు. విద్యార్థుల తప్పులను సరిదిద్ది, సరికొత్త విషయాలను నేర్పిస్తూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న గురువులందరికీ ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.. ఈ ఘన సన్మాన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి తాటిపాముల సాంబమూర్తి, రీజియన్ చైర్ పర్సన్ బాపు రెడ్డి, జోన్ చైర్పర్సన్ రౌతు వెంకటేశం, మాజీ అధ్యక్షులు సిరంగి శంకర్, దేవరకొండ రాజయ్య, ఉపాధ్యక్షులు మద్దికుంట రామచందర్ మరియు క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కుప్టి ఘాట్ వద్ద ట్రాఫిక్ క్లియర్ చేయిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### హైవే అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం



నెరడిగొండ సెప్టెంబర్5(జనంసాక్షి): నియోజకవర్గ ప్రజల ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా స్వయంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రోడెక్కారు. శనివారం రోజున మండలంలోని కుప్టి ఘాట్ వద్ద ఏర్పడిన భారీ ట్రాఫిక్ జాం వద్దకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చేరుకున్నారు. స్వయంగా బ్రిడ్జిపై నుంచి వాహనాలను పంపిస్తూ ట్రాఫిక్ క్లియర్ చేశారు. హైవే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే కుప్టి బస్టాప్ వద్ద తాత్కాలిక మళ్లింపు కొరకు జేసీబి సహాయంతో చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ హైవే అధికారులు పట్టించుకోకపోవడంతో నియోజకవర్గ ప్రజల ఇబ్బందులు చూసి స్వయంగా వచ్చి ట్రాఫిక్ క్లియర్ చేశామన్నారు. భారీ వాహనాల దారి మళ్లింపు కొరకు జేసిబి సహాయంతో చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. త్వరలోనే హైదరాబాద్‌లో హైవే అధికారులను కూడా కలుస్తానని, తప్పకుండా కుప్టి బ్రిడ్జికి శాశ్వత పరిష్కారం అయ్యేవరకు వదలమన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న తక్షణమే తమ వద్దకు చేరుతానని భరోసా కల్పించారు.

## భారీ వర్షానికి ప్రహరీగోడ కూలి ఆస్తి నష్టం






**దేవరుప్పుల సెప్టెంబర్ 5(జనం సాక్షి)** మండలంలోని ధర్మగడ్డ తండా వద్ద గల లక్ష్మి శ్రీనివాస్ కాటన్ ఇండస్ట్రీస్‌లో శనివారం కురిసిన భారీ వర్షం కారణంగా తీవ్ర నష్టం వాటిల్లింది. కాటన్ మిల్లు ప్రహరీగోడ కూలిపోవడంతో పాటు బోర్లు కూడా దెబ్బతిన్నాయని పరిశ్రమ యజమాని మడిశెట్టి రాజు తెలిపారు. భారీ వర్షానికి ప్రహరీగోడ కూలిపోవడంతో దాదాపు రూ. 20 లక్షల నుంచి రూ. 25లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల కారణంగా పరిశ్రమకు జరిగిన నష్టాన్ని అధికారులు పరిశీలించి, నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని మడిశెట్టి రాజు కోరారు. అధికారులు పర్యటించి నష్టాన్ని అంచనా వేయాలని, ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సీఐ శ్రీనివాస్‌ను సన్మానించిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు బూర్ల శంకర్



**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 05(జనం సాక్షి) :** స్టేషన్ఘన్పూర్ నూతన సిఐగా శ్రీనివాస్ బాధ్యత చేపట్టిన సందర్భంగా స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో కాంగ్రెస్ పార్టీ జిల్లానాయకుడు బూర్ల శంకర్ తో పాటు కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బూర్ల శంకర్ ఆధ్వ ర్యంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం నూతన సీఐ శ్రీనివాస్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హరినాథ్, ఎండి యాకూబ్ పాషా, నోముల జయపాల్ రెడ్డి, దశరథం, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా కటుకోజ్వల సతీష్

### కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందజేత



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా పులిగిల్ల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కటుకోజ్వల సతీష్ ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మరియు హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి గిరిరాజ్ గౌడ్ చేతుల మీదుగా కటుకోజ్వల సతీష్‌ను శాలువాతో సత్కరించి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, సృజనాత్మక బోధనా పద్ధతులు, పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు, విద్యార్థులలో ప్రతిభను వెలికితీయడంలో చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించడం పట్ల పులిగిల్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పుల్యాల సంపత్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు కటుకోజ్వల సతీష్‌ను అభినందించారు.

# ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రధానోత్సవం

- ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు కలిపి 55 మంది ఉపాధ్యాయుల ప్రధానం
- హాజరైన కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, కుడా చైర్మన్ తదితరులు



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 05 (జనం సాక్షి)** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం వరంగల్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆకుతోట కన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ డీఈవో రంగయ్య నాయుడు అధ్యక్షత వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, ఎమ్మెల్యే కె నాగరాజు, అడిషనల్ కలెక్టర్ వైవి గణేష్, కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్ పర్సన్ గుండు సుధారాణి, డి ఆర్ డి ఓ నాగ పద్మజ, డి పి ఆర్ ఓ ప్రేమలత, జడ్పీ సీఈవో వసంతకుమారి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, మేరు కార్పొరేషన్ చైర్మన్ వెంకట్రాజం, కిలా వరంగల్ మండల తహసిల్దార్ ఇక్బాల్ తదితరులు హాజరయ్యారు. ముందుగా డీఈవో రంగయ్య నాయుడు మాట్లాడుతూ జిల్లాలోని 50 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు, ఐదుగురు ప్రైవేటు విద్యాసంస్థల పనిచేస్తున్నటువంటి ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో వివిధ రకాల 834 పాఠశాలలు ఉన్నాయని ఇందులో 1,19, 773 మంది విద్యార్థులు చదువుతున్నట్లు తెలిపారు. విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తుందని తెలిపారు. కూడా చైర్ పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చినటువంటి మహానుభావుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అన్నారు. ఉపరాష్ట్రపతిగా రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించి దేశానికి ఎంతో సేవ చేశారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఉపాధ్యాయులను విద్యార్థులు ఎన్నడూ మర్చిపోరని అన్నారు. తాను ఫస్ట్ క్లాస్ టీచర్ను ఏ రోజు మర్చిపోలేదని గుర్తు చేశారు. తనకు హ్యాండ్ రైటింగ్ నేర్పించారని ఉపాధ్యాయుల వల్లనే తాను ఇంతదాని అయినట్టు తెలిపారు. కెరీర్ను మార్చేది టీచర్ అని గుర్తు చేశారు. ఉపాధ్యాయుల శ్రమ వల్ల విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పురస్కారాలకు ఎంపికైనటువంటి ఉపాధ్యాయులను అభినందించారు. ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులకు ఉండే గౌరవం ఎవరికి ఉండదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా వైద్యం క్రీడల మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు కల్చరల్ స్పోర్ట్స్ యాక్టివిటీస్ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేయాలని కోరారు. వచ్చే సంవత్సరం నుండి వీటికి ఎలాంటి ఖర్చయిన తాను భరిస్తానని పేర్కొన్నారు. తాను చదువుకున్నప్పుడు ఉపాధ్యాయులు బెత్తంతో కొట్టేవారని, కానీ ఇప్పుడు బెత్తంతో కొట్టడం గాని బెదిరించడం గాని ఏదీ లేదని అన్నారు. తనను ఉపాధ్యాయులు కొట్టడం వల్ల క్రమశిక్షణలో పెట్టడం వల్ల తాను ఇంత వాణ్ని అయినట్లు ఎమ్మెల్యే నాగరాజు గుర్తు చేశారు. తాను మామునూరు క్యాంపు, రంగసాయిపేట, హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో చదివినట్లు తెలిపారు. తాను నేషనల్ హాకీ ప్లేయర్ గా ఎదిగినట్లు చెప్పారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శ్రీధరాచార్యులు యాంకరింగ్ చేయగా కరీమాబాద్, కృష్ణ కాలనీ, మట్టవాడ, నెక్కొండ మొదలైన ప్రభుత్వ పాఠశాల నుండి వచ్చినటువంటి విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయ పురస్కార ప్రధానోత్సవం అధ్యంతం ఉత్సాహంగా కొనసాగింది.

## పత్తి పంటలో రసం పీల్చే పురుగుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

### మండల వ్యవసాయ అధికారి ఎస్ కరుణాకర్



**స్టేషన్ ఘన్ పూర్, సెప్టెంబర్ 05 (జనంసాక్షి ):** పత్తి పంటలో రసం పీల్చే పురుగుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి కరుణాకర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని పత్తి పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి ఎస్ కరుణాకర్, రైతులతో కలిసి సందర్శించి పంట పరి స్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పత్తి పంటలో పేనుబంక, పచ్చదోమ, తామర పురు గుల ఉనికిని గుర్తించి, వాటి నష్ట లక్షణాలు సమగ్ర నివారణ చర్యలను రైతులకు వివరిం చారు. పేనుబంక పురుగులు ఆకుల అడుగు భాగంలో గుంపులుగా చేరి రసాన్ని పీల్చుడం వల్ల ఆకులు ముడుచుకోవడం, మొక్కల పెరుగు దల మందగించడం జరుగుతుందని ఇవి విసర్జించే జిగురు పదార్థంపై నల్లటి మసి తెగులు ఏర్పడే అవకాశం ఉంటుందని ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు తగిన మందులు పిచికారి చేయాలని అన్నారు. పచ్చదోమ ఆకుల అడుగు భాగం నుంచి రసాన్ని పీల్చ డం వల్ల ఆకుల అంచులు మొదట పసుపు రంగులోకి, తరువాత ఎరుపు, గోధుమ రంగులోకి మారి కిందికి ముడుచుకుంటాయని, తీవ్రత పెరిగినప్పుడు ఆకులు ఎండిపోయి మొక్కల పెరుగుదల, దిగుబడిపై ప్రభావం చూపుతుందని, తామర పురుగులు లేత ఆకుల నుంచి రసాన్ని పీల్చుడం వల్ల ఆకులపై వెండి రంగు చారలు కనిపించడం, ఆకులు ముడుచుకోవడం, మొక్కల పెరుగుదల తగ్గడం జరుగుతుందని ఉధృతి ఎక్కువగా ఉన్న ప్పుడు తగిన మందులు పిచికారి చేయాలని అన్నారు. ఒకే పురుగుమందును పదేపదే ఉపయోగించకుండా, వేర్వేరు చర్యా విధానం కలిగిన మందులను అవసరాన్ని బట్టి మార్చి వాడాలని సూచించారు. ఒకేసారి రెండు లేదా అంతకంటే ఎక్కువ పురుగుమందులను అనవసరంగా కలిపి పిచికారీ చేయరాదని అన్నారు . ఈ క్షేత్ర సందర్శనలో వ్యవసాయ విస్తరణ అధికారి అనిత, సంబంధిత గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఖైరగురా ఓసీపీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: ఐఎన్టియుసి



**తాండూర్, సెప్టెంబర్ 05(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా : ఖైరగురా ఓసీపీ ఘని కార్మికులు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం రోజున బెల్లంపల్లి ఐ ఎన్ టి యు సి యూనియన్ ఆధ్వర్యంలో ఖైరగురా ప్రాజెక్ట్ అధికారి సమగ్ర మెమోరాండం అందజేయడం జరిగింది.బెల్లంపల్లి ఐఎన్టియుసి యూనియన్ ఉపాధ్యక్షులు శ్రీ పేరం శ్రీనివాస్ నేతృత్వంలో కార్మిక ప్రతినిధుల బృందం యాజమాన్యానికి డిమాండ్లను వివరించింది. కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఐఎన్టియుసి నిరంతరం పోరాడుతుందని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.ప్రధాన డిమాండ్లు 70 శాతం ఫ్లేడేల పునరుద్ధరణ: ప్రస్తుతం అమలు చేస్తున్న ఫ్లేడే విధానం వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతోంది. దీని స్థానంలో గతంలో ఉన్న పద్ధతిలోనే 70 శాతం ఫ్లేడేలు కల్పించాలి, ఏటా పిఎంఈ విధానం రద్దు: ప్రతి సంవత్సరం ఒకసారి (ఆవర్తన వైద్య పరీక్షలు) నిర్వహించాలనే తుగ్లక్ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి. గతంలో లాగే 3 లేదా 5 సంవత్సరాలకు ఒకసారి మాత్రమే పరీక్షలు జరపాలి. సిఎంపిఎఫ్ చిట్టీల పంపిణీ: 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సిఎంపీఫ్ చిట్టీలను పెండింగ్‌లో పెట్టకుండా కార్మికులకు వెంటనే అందజేయాలి. యాజమాన్యానికి హెచ్చరిక:కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం సానుకూలంగా స్పందించి ఈ సమస్యలను పరిష్కరించాలి. లేనిపక్షంలో కార్మికుల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ ప్రకాష్ రావు , ఏరియా కార్యదర్శులు మాధవ్ కృష్ణ, బూర శ్రీనివాస్, అసిస్టెంట్ కార్యదర్శి గోమాస ప్రభాకర్ మరియు ఇతర ముఖ్య నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# తాండూర్ పంచాయతీలో అధికారుల నిర్లక్ష్యం

### గంటల తరబడి అభ్యర్థుల నిరీక్షణ

**తాండూర్, సెప్టెంబర్ 05(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా : తాండూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉదయం అధికారుల తీరుపై అభ్యర్థులు తీవ్ర అసహనం మరియు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధుల్లో సమయపాలన పాటించాల్సిన అధికారులే బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.అసలేం జరిగిందంటే..నిర్దిష్ట అధికారిక ప్రక్రియ కోసం గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి నోటీసులు అందుకున్న అభ్యర్థులు, అధికారులు ముందుగా నిర్ణయించిన సమయం ప్రకారం శనివారం ఉదయం 9:00 గంటలకే కార్యాలయానికి చేరుకున్నారు. అయితే, ఉదయం 10:30 గంటలు దాటినా సంబంధిత అధికారులు ఎవరూ సీట్లలో లేకపోవడంతో అభ్యర్థులు గంటల తరబడి కార్యాలయం బయటే నిరీక్షించాల్సి వచ్చింది.అభ్యర్థుల ఆవేదన:"మాకు నోటీసులు ఇచ్చి ఖచ్చితమైన సమయానికి రమ్మని చెప్పిన అధికారులే, గంటన్నర దాటినా రాకపోవడం ఏంటి?" అని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. దూర



ప్రాంతాల నుండి పనులన్నీ మానుకుని వచ్చిన తమను ఇలా ఇబ్బందులకు గురి చేయడం తగదని వారు మండిపడ్డారు. అధికారుల ఆలస్యం వల్ల తమ విలువైన సమయం వృధా అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.డిమాండ్:ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాండూర్ గ్రామ పంచాయతీలో సమయపాలన లోపించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, నోటీసులు అందుకున్న అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం



**సారంగాపూర్, సెప్టెంబర్ 5 (జనం సాక్షి)** మండలంలోని బీరవెల్లి గ్రామంలో విజేత ప్రైవేట్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. డా: సర్వేపల్లి రాదాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులే ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు విద్యాబోధన చేసారు. ఉపాధ్యాయులే ఈ సమాజంలో ఉన్న విద్యార్థుల భవిష్యత్ తీర్చి దిద్దగలరు అని పిల్లల సందేశాలు అందర్నీ ఆకట్టున్నాయి.

# మృతి చెందిన కుటుంబాలకు పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామ్ కిషన్ రెడ్డి



**సారంగాపూర్,సెప్టెంబర్5(జనం సాక్షి)** సారంగాపూర్ మండల కేంద్రంలోని చించోలి ఎం గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ సాయందర్ తమ్ముడు తాండ్ర అడేల్లు శుక్రవారం రాత్రి అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. అలాగే దుప్య తండాలో జాదవ్ మంగీలాల్ ఇటీవల మృతి చెందారు , రాంసింగ్ తండాలో జాదవ్ కుంబాజి ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను శనివారం నిర్మల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కిషన్ రెడ్డి కలిసి ప్రగాఢ సానుభూతిని తెలిపి పరామర్శించారు. వీరి వెంటనిర్మల్ కన్వీనర్ మహేష్ రెడ్డి, సారంగాపూర్ అధ్యక్షులు దేవి శంకర్ ముత్యం రెడ్డి ముఠాపూర్. చంద్రశేఖర్ రెడ్డి లక్ష్మీనారాయణ గౌడ్ అడెల్లి గంగాధర్ ,సతీష్ భోజన్న చించోలి.యం నరేష్. ధనుంజయ్ బుర్రి రాజు శ్రీధర్ పల్లి తదితరులు ఉన్నారు.

## తాండూరు మండలంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**తాండూర్, సెప్టెంబర్ 05(జనం సాక్షి )** మంచిర్యాల జిల్లా : తాండూరు మండల కేంద్రంలో శనివారం రోజున ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాండూరు మండల విద్యాధికారి డి. శ్రీనివాస్, తంగళ్లపల్లి జెడ్పీహెచ్ఎస్‌కాంప్లెక్స్‌ప్రధానోపాధ్యాయులు ఎస్. మల్లేశం, మరియు అచలాపూర్ జెడ్పీహెచ్ఎస్ ( ప్రధానోపాధ్యాయురాలు పి. ఉమాదేవి హాజరయ్యారు. ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి డి. శ్రీనివాస్ చేతుల మీదుగా ఘనంగా సన్మానం చేసి, ప్రశంసా పత్రాలను ప్రధానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అటవీ ప్రాంతంలో డీఎఫ్ఓ విస్తృత పర్యటన

## రోడ్డు సమస్య పరిష్కారానికి హామీ



**సిర్పూర్ టి, సెప్టెంబర్ 05(జనం సాక్షి):** జిల్లా అటవీ అధికారి డీఎఫ్ఓ బాలామణి శనివారం సిర్పూర్ రేంజ్ పరిధిలోని మాలిని అటవీప్రాంతంలో పర్యటించారు. ఈ మధ్య కాలంలో మాలిని అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు వస్తున్న వార్తలపై డీఎఫ్ఓ బాలామణి ప్రత్యేకంగా సమీక్షించారు. పులి కదలికలను కనిపెట్టడానికి అడవిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఎప్పటికప్పుడు పరిస్థితిని గమనిస్తున్నామని ఆమె తెలిపారు. అడవి పరిసర గ్రామాల్లోని ప్రజలు, రైతులు అడవి వైపు వెళ్లకూడదని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా అటవీ సంరక్షణ, శాఖాపరమైన అంశాలపై సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. డీఎఫ్ఓ పర్యటన విషయం తెలుసుకున్న చీలపల్లి, మేడిపల్లి, మాలిని గ్రామపంచాయతీల సర్పంచులు ఆమెను కలిసి, మండలం నుండి తమ ప్రాంతలకి రహదారి సమస్యను వివరించారు. అటవీ ప్రాంతం గుండా వెళ్లే రోడ్డు నిర్మాణానికి ఎదురవుతున్న అడ్డంకులను తొలగించి, సమస్యను పరిష్కరించాలని కోరారు. సర్పంచుల వినతిపై డీఎఫ్ఓ బాలామణి సానుకూలంగా స్పందించారు. నిబంధనల ప్రకారం రహదారి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో డీఎఫ్ఓతో పాటు ఎఫ్డీవో భార్గవ్ కుమార్, ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్, సెక్షన్ ఆఫీసర్ మోహన్ రావు మరియు అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 5, (జనంసాక్షి)** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని మొదటి ఉపరాష్ట్రపతిగా, రెండవ రాష్ట్రపతిగా, దేశానికి గొప్ప ఉపాధ్యాయులుగా ఆయన అందించిన సేవలను వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ అధ్యక్షతన, సాంస్కృతిక విభాగం మరియు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాలలోని అధ్యాపకులకు ఘనంగా సత్కారం జరిగింది. ఒక్కో బోధన సిబ్బందిని శాలువా, మెమెంటోతో సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఉపాధ్యాయుల ప్రసంగాలు, పాటలు విద్యార్థులను ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సూపర్డెంట్ పుప్పాల శ్రీనివాస్ బోధ నేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# రణరంగంగా మారిన భూపాలపల్లి!

నినాదాలు.. దీంతో అంబేద్కర్ సెంటర్‌లో కొద్దిసేపు తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా ఆ పార్టీ కార్యకర్తలు నినాదాలు చేయగా.. బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో రెండు వర్గాల నినాదాలతో కూడలి హోరెత్తింది. కాంగ్రెస్ విజయోత్సవ కార్యక్రమం జరుగుతున్న సమయంలోనే బీఆర్ఎస్ శ్రేణులు అక్కడికి చేరుకుని నినాదాలు చేయడాన్ని కాంగ్రెస్ వర్గాలు తీవ్రంగా తప్పుబట్టాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్న కాంగ్రెస్ కార్యక్రమం వద్దకు వచ్చి బీఆర్ఎస్ శ్రేణులు అత్యుత్సాహం ప్రదర్శించారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు.

**భారీ బందోబస్తు.. క్షణక్షణం అప్రమత్తం..**

పరిస్థితి మరింత విషమించకుండా పోలీసులు రంగంలోకి దిగారు. అంబేద్కర్ సెంటర్, పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించారు. ఇరువర్గాలను వేరు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అదనపు బలగాలను రంగంలోకి దించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. కొద్దిసేపు తీవ్ర ఉత్కంఠ నెలకొన్నప్పటికీ పోలీసులు సమర్థంగా వ్యవహరించడంతో పరిస్థితి క్రమంగా సద్దుమణిగింది. అయితే కాంగ్రెస్ విజయోత్సవ కార్యక్రమం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు అత్యుత్సాహంగా వ్యవహరించడం భూపాలపల్లిలో రాజకీయ చర్చకు దారితీసింది.

**విజయోత్సవానికి పోటీగా నిరసన..**

వెయ్యి రోజుల ప్రజాపాలన విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్న కాంగ్రెస్ వ్యూహానికి సమాంతరంగా బీఆర్ఎస్ నిరసన కార్యక్రమం చేపట్టడం, రెండు కార్యక్రమాలు ఒకే ప్రాంతంలోకి రావడం పరిస్థితిని మరింత వేడెక్కించింది. ముఖ్యంగా కాంగ్రెస్ సభ కొనసాగుతున్న సమయంలో బీఆర్ఎస్ కార్యకర్తలు రోడ్డుపైకి వచ్చి నినాదాలు చేయడం ఉద్రిక్తతకు ప్రధాన కారణంగా మారింది. వెయ్యి రోజుల పాలనను కాంగ్రెస్ విజయంగా ప్రచారం చేస్తుండగా.. బీఆర్ఎస్ మాత్రం అదే వెయ్యి రోజులను 'దగా పాలన'గా అభివర్ణిస్తూ నిరసనకు దిగింది. దీంతో భూపాలపల్లి వేదికగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరోసారి బహిర్గతమైంది. కాంగ్రెస్ విజయోత్సవాన్ని అడ్డుకునేలా బీఆర్ఎస్ శ్రేణుల అత్యుత్సాహం ప్రదర్శనగా మారిందనే విమర్శలు రాజకీయ వర్గాల్లో వినిపించాయి.



## అఖిల భారత స్వర్ణకార సంఘం ఉపాధ్యక్షుడు మృతి

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 5, (జనంసాక్షి) :** అఖిల భారత స్వర్ణకార సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘ గౌరవ అధ్యక్షుడు బ్రహ్మశ్రీ కట్ట సత్యనారాయణ బుధవారం నాడు అనారోగ్యంతో వరంగల్ ఆసుపత్రిలో మృతి చెందాడు. ఈ సందర్భంగా బెల్లంపల్లి పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించి ఆయన పవిత్ర ఆత్మకు సద్గతులు ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తూ, నివాళి అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు దేవరకొండ మనోహర చారి, ప్రధాన కార్యదర్శి రంగు ఉపేంద్ర చారి, కోశాధికారి గడ్డం శ్రీనివాస్, సీనియర్ సభ్యులు గడ్డం చంద్రమౌళి, అక్కెనపల్లి సత్యనారాయణ, సజ్జనపు పెద్ద వెంకట చారి, గడ్డం నంబయ్యచారి, రామోజు లక్ష్మణ్, ఉపాధ్యక్షులు రంగు కుమార్, స్వర్ణకార సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## యూనిఫాంల పంపిణీ..

**తాండూర్, సెప్టెంబర్ 05(జనం సాక్షి) :** మంచిర్యాల జిల్లా :తాండూర్ మండలం అచలాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు ఉచిత యూనిఫాంల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ మారిశెట్టి స్రవంతి శ్రీనివాస్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చేతుల మీదుగా విద్యార్థులకు యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలితో పాటు ఉపాధ్యాయ బృందానికి గ్రామ సర్పంచ్ స్రవంతి శ్రీనివాస్ మరియు వార్డ్ మెంబర్ దాగం పోచయ్య ప్రత్యేకంగా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డిజిటల్ రీ-సర్వేతో భూ సమస్యలకు చెక్!

వస్తాయని కలెక్టర్ తెలిపారు. దీనివల్ల భూ రికార్డుల్లో మరింత పారదర్శకత ఏర్పడటమే కాకుండా భూ హద్దులు, విస్తీర్ణం తదితర వివరాలపై స్పష్టత వస్తుందని, భవిష్యత్తులో భూ వివాదాల పరిష్కారానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాల తర్వాత భూములకు రీ-సర్వే జరుగుతున్న నేపథ్యంలో రైతులు సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని రాహుల్ శర్మ కోరారు. రీ-సర్వే ప్రక్రియపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, వారి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

**రైతుల వద్దకే అధికారులు.. హర్షం వ్యక్తం చేసిన యాకయ్య**



ఈ సందర్భంగా అప్పయ్యపల్లి రైతు కొప్పుల యాకయ్య మాట్లాడుతూ.. గతంలో భూములకు సంబంధించిన సమస్యలు తలెత్తినప్పుడు వాటి పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ భూ రీ-సర్వే విధానంతో పరిస్థితి మారిందని, అధికారులు తమ గ్రామాలకు, తమ భూముల వద్దకే వచ్చి సర్వే నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూముల కొలతలు చేపట్టి, భూ వివరాలను డిజిటల్‌గా నమోదు చేయడం వల్ల రికార్డుల్లో మరింత స్పష్టత ఏర్పడుతుందని యాకయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి రైతు భూమికి సంబంధించిన హద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలు కచ్చితంగా నమోదైతే భవిష్యత్తులో భూ తగాదాలు తగ్గడంతో పాటు భూములకు సంబంధించిన సమస్యలు త్వరగా పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గతంలో రైతులే అధికారుల కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు అధికారులే రైతుల వద్దకు వచ్చి భూములను పరిశీలించి సర్వే చేయడం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. తమ భూములకు సంబంధించిన వివరాలు స్పష్టంగా నమోదై భూధార్ సంఖ్య, మ్యాప్ అందితే భవిష్యత్తులో తమకు మరింత భరోసా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ రీ-సర్వే కార్యక్రమం రైతులకు ఎంతో మేలు చేస్తుందని యాకయ్యతో పాటు పలువురు రైతులు పేర్కొన్నారు. డిజిటల్ భూ రీ-సర్వే ద్వారా భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, కచ్చితత్వం పెరగడంతో పాటు రైతులకు తమ భూములపై స్పష్టమైన హక్కులు, వివరాలు అందుబాటులోకి వస్తాయని యాకయ్య అన్నారు. రైతుల వద్దకే వచ్చి సర్వే నిర్వహిస్తున్న అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంతకాలం భూ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగిన తమకు, ఇప్పుడు అధికారులు స్వయంగా తమ వద్దకు వచ్చి భూములను సర్వే చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ విధానం కొనసాగితే రైతులకు సమయం, శ్రమ ఆదా అవుతుందని కొప్పుల యాకయ్య సంతోషం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, తహసీల్దార్ రాజేశ్వరరావు, సర్వే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



నిర్మల్ రూరల్, సెప్టెంబర్ 05,(జనంసాక్షి): విజయ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులు గురువుల సేవలను కొనియాడుతూ ప్రసంగాలు, పాటలు, నృత్యాలతో అలరించారు. ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమని వైస్ ప్రెసిడెంట్ అంబరాణి పేర్కొన్నారు. రాధాకృష్ణన్ ఆశయాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని కరస్పాండెంట్ మంచిరాల నాగభూషణం, ప్రధానోపాధ్యాయుడు సామ మోహన్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో యాజమాన్య సభ్యులు సీరం విజయలక్ష్మి, ప్రతాపరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజీవ్‌నగర్‌లో సుపోషణ కార్యక్రమం

**తాండూర్, సెప్టెంబర్ 05 (జనం సాక్షి) :** మండలం లో రాజీవ్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో సుపోషణ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ మామిడాల లలిత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమతుల్య పోషకాహారం అందించడం ఎంతైనా అవసరమని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

## గురువుల పాత్రలో మెరిసిన విద్యార్థులు



**సిర్పూర్ టి, సెప్టెంబర్ 05 (జనం సాక్షి):** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, జన్మదినాన్ని పురస్కరించుకుని, మండలంలోని పాఠశాల లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో పాఠశాలలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. ఈ రోజు పాఠశాలలన్నీ 'చిన్ని టీచర్ల' బడిగా మారిపోయాయి. ఉపాధ్యాయుల పాత్రను పోషించిన విద్యార్థులు చిన్నపాటి పంతుళ్లు, పంతులమ్మలుగా, క్లాసు రూముల్లో సందడి చేశారు. తమ చిట్టి చిట్టి మాటలతో, బుజ్జి బుజ్జి పాటలతో తోటి విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ అలరించారు.

## మాదారంలో గ్రామసభ



**తాండూర్, సెప్టెంబర్ 05(జనం సాక్షి) :** మంచిర్యాల జిల్లా :తాండూర్ మండలం లో మాదారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో గ్రామ సభ అత్యంత విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ సభలో ప్రధానంగా రాబోయే 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకం కింద చేపట్టబోయే పలు అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. గ్రామంలో కుంటలు, ట్రెంచ్ పనులు, ఇంకుడు గుంతల నిర్మాణం, మరియు పండ్ల తోటల పెంపకం మొదలైన పనులను చేపట్టేందుకు గ్రామస్తులు, ఉపాధి హామీ శ్రామికులతో కలిసి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మాదారం గ్రామానికి ఎనలేని సేవలు అందిస్తున్న అంగన్వాడీ టీచర్లు మీన, యాదలక్ష్మిలను గ్రామ పాలకవర్గం శాలువాలతో ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు, పంచాయతీ సెక్రెటరీ శ్రీవాణి, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు.

## కొత్తపల్లి రైతు వేదికలో రైతు శిక్షణ

**తాండూర్, సెప్టెంబర్ 05(జనం సాక్షి ) :** మంచిర్యాల జిల్లా : తాండూర్ మండల పరిధిలోని కొత్తపల్లి రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో, ఉద్యాన శాఖ ద్వారా శనివారం రైతు శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఉద్యాన శాఖ అధికారిణి అర్చన మాట్లాడుతూ.. ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల్లో రైతులు సాంకేతిక పద్ధతులను అలవర్చుకోవాలని సూచించారు. కూరగాయల సాగులో మల్చింగ్, డ్రిప్, మరియు స్ప్రింక్లర్ వంటి ఆధునిక నీటి యాజమాన్య పద్ధతులను ఉపయోగించడం ద్వారా తక్కువ నీటితోనే సంపూర్ణంగా ఎక్కువ దిగుబడి సాధించవచ్చని వివరించారు. అలాగే కూరగాయలు సాగు చేసే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా లభించే వివిధ ప్రభుత్వ సబ్సిడీల గురించి రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారిణి కె. సుష్మ మాట్లాడుతూ.. పంటల సాగులో రైతులు పాటించాల్సిన ఎరువుల యాజమాన్య పద్ధతులపై కూలంకషంగా వివరించారు. సమతుల్యంగా ఎరువులు వాడటం ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గి, నాణ్యమైన దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై రైతులకు పూర్తి అవగాహన లభించింది. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామ సర్పంచ్ వెంకటేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు వెంకటేశ్, ఎంబడి శ్వేత రాణి, మాట్రిక్స్ కిరణ్ మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

